తిరుపతి - చిత్తూరు

తెలుగు జాతీయ దినపత్రిక

వార్త

## కారు బోల్తా : యువకుడు మృతి

### -మరో యువకుడికి తీవ్రగాయాలు



శాంతిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

కుప్పం - పలమనేరు జాతీయ రహదారిలో కడపల్లి సమీపంలో ఆదివారం రాత్రి కారు అదుపు తప్పి బోల్తా పడిన సంఘ టనలో ఓ యువకుడు మృతి చెందగా మరో యువకుడు తీవ్ర ంగా గాయపడ్డాడు. వివరాలిలా.. రాళ్లబూదుగూరుకు చెందిన జమీర్ అహ్మద్, మహ్మద్ సిద్ధిక్, తమిళనాడుకు చెందిన లోకేష్, తరుణ్‌లు ఆదివారం రాత్రి కారులో బయలుదేరారు. మార్గమధ్యంలో కడపల్లి వద్ద కారు రోడ్డు పక్కన గల కల్వర్టును ఢీకొని పొలాల్లో బోల్తా పడింది. దీంతో జమీర్ అహ్మద్ అనే యువకుడు అక్కడికక్కడే మృతి చెందాడు. మిగతా ముగ్గుర్ని 108లో చికిత్స కోసం కుప్పం పిఇఎస్‌కు తరలించారు. వీరిలో సిద్ధిక్ పరిస్థితి విషమంగా మారడంతో తిరుపతికి తరలించారు. రాళ్లబూదుగూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమలలో జోరువాన

తిరుమల, అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి: బంగాళాఖాతంలో అల్పపీడనం ప్రభావంతో సోమవారం ఉదయం నుండి తిరుమలలో జోరు వర్షం కురుస్తోంది. ఉదయం నుండి మొదలైన వాన రాత్రి కూడా కురుస్తోంది. భక్తులు ఎక్కడికక్కడే ఆగిపోయారు. తిరుమలలో కురిసిన వరద నీటికి ఆలయం పరిసరాలు, ఘాట్ రోడ్లు జలమయంగా మారాయి. వర్షం కురుస్తుండటంతో బలమైన చలిగాలులు వీస్తున్నాయి. భక్తులు షెడ్లలలో తలదాచుకోవాలని టిటిడి అదనపు ఈఓచిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి కోరారు.



## అప్రమత్తం.. ముందస్తు చర్యలు

### కలెక్టర్ల టెలీ కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి చంద్రబాబు

### అన్ని విధాలా సంసిద్ధంగా ఉన్నాం : కలెక్టర్ వెంకటేశ్వర్లు



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్ప పీడనం వలన కురుస్తున్న భారీ వర్షాల కారణంగా కలెక్టర్లు అప్రమత్తంగా ఉండి ముందస్తు చర్యలు చేపట్టాలని రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. సోమవారం పలు జిల్లాల కలెక్టర్లతో టెలికాన్ఫిరెన్స్ నిర్వహించి ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేసారు. ఈ సందర్భంగా తిరుపతి జిల్లా నుండి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి కలెక్టర్లకు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైన అన్ని ముందస్తు చర్యలు తీసుకుని మానవ, పశుప్రాణ నష్టం, ఆస్తి నష్టం జరగకుండా చూడాలని ఆదేశించారు. సమాచార శాఖ, మీడియా, సోషల్ మీడియా తదితర మార్గాల ద్వారా ప్రజలకు ఎప్పటికప్పుడు సమాచారం అందించి అప్రమత్తం చేయాలని సూచించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ వివరిస్తూ జిల్లాలో ముందస్తుగా జిల్లా కేంద్రంలో, డివిజన్, మండల కేంద్రాల్లో కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి అందుకు అధికారులు వారి పరిధిలోని గ్రామాలలో పట్టణాలలో పర్యటించి డ్రెయిన్లు ఎక్కడైనా బ్లాక్ అయిన వాటిని క్లియర్ చేయడం, జిల్లాలోని ప్రజలను అప్రమత్తం చేయడం జరిగిందని, కోస్తా తీర ప్రాంతాల్లో మత్స్య కారులను అప్రమత్తంచేసి సముద్రంలోకి వేటకు వెళ్ల కుండా అప్రమత్తం చేసి పర్యవేక్షిస్తున్నామని తెలిపారు. ఎలాంటివిపత్తును అయినా ఎదుర్కొనేందుకు అన్ని విధాల సంసిద్ధంగా ఉన్నామని, ఎస్డిఆర్ఎఫ్ బృందాలను ఏర్పాటు చేశామని తెలుపుతూ ముఖ్యమంత్రి ఆదేశాలు మేరకు మార్గదర్శకం మేరకు ఎప్పటికప్పుడు అన్ని రకాల చర్యలు చేపడతామని తెలిపారు.

### ఎలాంటి విపత్తునైనా

## ఎదుర్కొనేలా సిద్ధంకావాలి

### -టిటిడి అదనపు ఈఓ వెంకయ్యచౌదరి



తిరుమల, అక్టోబర్ 14ప్రభాతవార్తప్రతినిధి:

తిరుమల ఘాట్‌రోడ్లపై కొండచరియలు విరిగిపడకుండా అన్ని విభాగాలు మరింత అప్రమత్తంగా ఉండాలని టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదని ఆదేశించారు. కీలకమైన అగ్నిమాపకశాఖ, ఆరోగ్యశాఖ, విజిలెన్స్ విభాగం, పోలీసు, అటవీశాఖ కీలకమైన విభాగాలు తమ సిబ్బందితో డిజాస్టర్ మేనేజ్‌మెంట్ రెస్పాన్స్ ఫోర్స్ ఏర్పాటుచేయాలని నిర్ధేశించారు. కొండ చరియలపై ప్రత్యేకంగా దృష్టి పెట్టాలన్నారు. బంగాళాఖాతంలో అల్పపీడనం బలపడి వాయుగుండంగా మారితే బలమైన వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ హెచ్చరించిన నేపథ్యంలో తిరుమలలో, ఘాట్‌రోడ్లపై తీసుకోవాల్సి న జాగ్రత్తలు గురించి సోమవారం సాయంత్రం తిరుమలలోని గోకులం విశ్రాంతి భవనం నుండి అధికారులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. తిరుపతికి భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ,ఘాట్ రోడ్లలో జెసిబిలు, ట్రక్కులు, ట్రాక్టర్లు తగినంతమంది సిబ్బందిని సిద్దంగా ఉంచుకుని సమాయత్తంగా ఉండాలని అదనపు ఇఒ తెలిపారు. ఈ సమావేశంలో టిటిడి జెఈఓలు గౌతమి, వీరబ్రహ్మం,సివిఎస్ఓ శ్రీధర్, సిఇ సత్యనారాయణ,సిపిఆర్ఓ డాక్టర్ తలారి రవి తదితరులు పాల్గొన్నారు..

### చంద్రయాన్-3తో ఐఎఫ్ వరల్డ్ స్పేస్

## అవార్డు అందుకున్న సోమనాథ్



శ్రీహరికోట (తడ), అక్టోబర్ 14 ప్రభాతవార్త

అంతరిక్ష పరిశోధనలో అత్యుత్తమ సేవలలో ఒకటైన ఐఎఫ్ వరల్డ్ స్పేస్ అవార్డును భారత అంతరిక్ష పరిశోధన సంస్థ అధ్యక్షుడు, డిఓఎస్ సెక్రటరి డాక్టర్ ఎస్.సోమనాథ్ సోమవారం అందుకున్నారు. ఈ ప్రిస్టేజియస్ అవార్డుకు ఆయన చంద్రయాన్-3 సాధించిన విజయంతో ఎంపికయ్యారు. ఈ సందర్భంగా అవార్డు తీసుకున్న సోమనాథ్ ఇక తన పూర్తి దృష్టి చంద్రయాన్-4పైనే ఉందని పేర్కొన్నారు. చంద్రయాన్-1 నుంచి మూడు ప్రాజెక్టులకు ఎంతోమంది ఇస్రో శాస్త్రవేత్తలతో పాటు ఇతర సంస్థల వారు కూడా కృషి చేశారని కొనియాడారు. ఈ సందర్భంగా ఛైర్మన్‌ను దేశంలోని వివిధ అంతరిక్ష పరిశోధన సంస్థల శాస్త్రవేత్తలు, సీనియర్ ఇస్రో అధికారులు శ్రీహరికోటలోని సతీష్‌ధవన్ స్పేస్ సెంటర్ ఉద్యోగులు అభినందించారు.

## మద్యం అమ్మకాలు ఎవరు ఎలా!

- మండల పరిధిలో ఎక్కడైనా పెట్టుకోవచ్చని మార్గదర్శకాలు
- అమ్మకాలు ఎక్కువ జరిగే ప్రాంతంపై మద్యం దుకాణదారులు గురి
- ఈ వ్యవహారంపై ఎక్సైజ్ అధికారులకు తలబొప్పి



చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

జిల్లాలో రెండేళ్ళ పాటు మద్యం దుకాణాల నిర్వహణ కోసం సోమవారం నిర్వహించిన డిప్‌లో ఎంపికైన మద్యం దుకాణాల పేర్లతో 'తాంబులాలు ఇచ్చేశాం తన్నుకు చావండి' అనే చందాన తయారైంది. డిప్ ద్వారా ఖరారైన మద్యం దుకాణదారుడు ఎక్కడ మద్యం దుకాణం నిర్వహించాలనే విషయంపై ఎక్సైజ్ శాఖ నుండి సరైన మార్గదర్శకాలు లేకపోవడమే దీనికి కారణం. ఎక్సైజ్ స్టేషన్ల పరిధిలోని మున్సిపాల్టీలు, మండలాలకు మద్యం షాపులు ఎన్ని అనే విషయంను నోటిఫికేషన్‌లో ప్రకటించారు కానీ ఈ మండలంలో ఈ మద్యం దుకాణంకు ఇక్కడ నిర్వహించాలనే విషయం చెప్పలేదు. ఒక మండల పరిధిలో నాలుగు దుకాణాలు వుంటే నాలుగు దుకాణ మద్యం దుకాణ నిర్వాహకులు ప్రక్కప్రక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేసుకొనే అవకాశం వుండటం గందరగోళం నెలకొంది. చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్‌లో సోమవారం మద్యం దుకాణాల ఏర్పాటుకు నిర్వహించిన లక్కీడిప్‌లో 104 మద్యం షాపులకు సంబంధించి 2,266 దరఖాస్తులను లక్కీ డిప్ ద్వారా 104 మద్యం దుకాణ వ్యాపారులను ఖరారు చేశారు. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్, నగరి, పలమనేరు, పుంగనూరు, కుప్పం మున్సిపాల్టీల్లో మద్యం దుకాణాలు మినహాస్తే మండలాల పరిధిలో 37 మద్యం దుకాణాలు మినహాయిస్తే మిగిలిన 67 మద్యం దుకాణాలు మండలాల ప్రాంతాల్లో ఏర్పాటు చేయాల్సి వుంది. ఇందులో కొన్ని లైసెన్సు ఫీజు ఏడాదికి రూ.55 లక్షలు వుండగా మరికొన్నింటికీ లైసెన్సు ఫీజు ఏడాదికి రూ.65 లక్షలుగా వుంది. ఈ పరిస్థితుల్లో పెనుమూరు, బంగారుపాళ్యం, యాదమరి, తవణంపల్లి, పూతలపట్టు మండల కేంద్రాల్లో మద్యం వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ఈ మండలాల్లోని ఇతర ప్రాంతాల్లో కొంత తక్కువ మద్యం అమ్మకాలు జరుగుతాయి. మండల కేంద్రంలో దుకాణం ఏర్పాటు చేసిన వారికి ఎక్కువ మొత్తంలో లాభాలు వచ్చే అవకాశం వుండటంతో లక్కీ డిప్‌లో మద్యం దుకాణాలు కైవసం చేసుకున్న ప్రతి ఒక్కరు మండల కేంద్రాల్లోనే మద్యం షాపు ఏర్పాటు చేసుకోవడానికి ఇప్పటికే రాజకీయ పార్టీల నేతలు, ఎక్సైజ్ అధికారులతో పైరవీలు ప్రారంభించారు. అలాగే కొన్ని ప్రాంతాల్లో మండల కేంద్రాల్లో మద్యం వ్యాపారం తక్కువగా జరిగితే అదే మండలంలో ఇతర ప్రాంతాల్లో మద్యం వ్యాపారం ఎక్కువగా జరుగుతుంది. ఉదాహరణకు చౌడేపల్లి మండలంలో 3 మద్యం షాపులు వుండగా ఇక్కడ బోయకొండలో ఏర్పాటు అయ్యే మద్యం షాపుకు ఎక్కువ ఆదాయం లభిస్తుంది. ఈ మండలంలో మండల కేంద్రం చౌడేపల్లి కంటే బోయకొండలో మద్యం షాపు ఏర్పాటుకు లక్కీ డిప్‌లో షాపును కైవసం చేసుకున్న ప్రతి మద్యం దుకాణ నిర్వాహకుడు ఆసక్తిగా వున్నాడు. అలాగే యాదమరి మండలానికి ప్రభుత్వం మూడు మద్యం షాపులను కేటాయించింది. ఇది వరకు ప్రైవేటు మద్యం దుకాణాలు వున్న సమయంలో ఒక దుకాణంను తమిళనాడు సరిహద్దులో కనికాపురం వద్ద, మరొక దుకాణంను వరిగపల్లి వద్ద, మరొక దుకాణంను మండల కేంద్రం యాదమరిలో ఏర్పాటు చేశారు. ప్రస్తుత నోటిఫికేషన్‌లో మండల పరిధిలో మూడు మద్యం దుకాణాలు వుండటంతో మండల కేంద్రం యాదమరిలో మద్యం వ్యాపారం రికార్డు స్థాయిలో జరుగుతుండటంతో ఇక్కడి మద్యం దుకాణంను కైవసం చేసుకోవడానికి ఒకే షాపుకు ఆశావాహులు 43 దరఖాస్తులు చేసుకున్నారు. మిగిలిన రెండు మద్యం దుకాణాల కోసం ఒకొక్క షాపుకు 27 దరఖాస్తులు అందాయి. అయితే ఇప్పుడు ముగ్గురు సైతం ఒకే ప్రదేశంలో మద్యం దుకాణం నిర్వహించుకునే అవకాశం వుండటంతో ప్రస్తుతం మద్యం దుకాణ నిర్వహణకు ఎంపికైన వ్యాపారులు అందరు మండల కేంద్రం యాదమరిలోనే మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపనున్నారు. ఎందుకంటే మండల కేంద్రం యాదమరిలోని మద్యం దుకాణంలో ప్రతి రోజు 3 లక్షల రూపాయల నుండి 3.50 లక్షల రూపాయల వరకు వ్యాపారం జరుగుతుంది. ఆదివారాలు, సెలవు రోజుల్లో 5 లక్షలకు పైబడి వ్యాపారం జరుగుతుంది. ప్రస్తుతం మద్యం దుకాణాలు నిర్వహించడానికి ఎంపికైన ముగ్గురు దుకాణ నిర్వాహకులు యాదమరిలో మద్యం దుకాణం ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతన్నారు. ఇదే పరిస్థితి మిగిలిన మండలాల్లో సైతం నెలకొంది. గంగాధరనెల్లూరులో నాలుగు మద్యం దుకాణాలు, బంగారుపాళ్యం మండలంలో ఐదు మద్యం దుకాణాలు, తవణంపల్లి మండలంలో నాలుగు మద్యం దుకాణాలు, ఐరాల మండలంలో నాలుగు మద్యం దుకాణాలు ఏర్పాటు కానున్నాయి. ఇందులో మద్యం అమ్మకాలు ఎక్కువ జరిగే ప్రదేశాల్లో తాము మద్యం దుకాణం ఏర్పాటు చేస్తామని లక్కీ డిప్‌లో పేర్లు వచ్చిన మద్యం దుకాణ వ్యాపారులు స్పష్టం చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో లక్కీ డిప్‌లో పేర్లు ఖరారై మద్యం షాపులు దక్కించుకున్న దుకాణదారులకు నచ్చజెప్పి ఒకొక్క ప్రదేశంలో ఒకొక్కరికి మద్యం షాపు పెట్టించుకొనే విధంగా చేయడానికి ఎక్సైజ్ అధికారులకు తలబొప్పిగా మారింది.

### సిండికేట్ చేయడానికి ప్రయత్నాలు!

ప్రైవేటు మద్యం వ్యాపారం ప్రారంభంలోనే సిండికేట్ చేయడానికి రాజకీయ పెద్దలు, అధికారులు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఒక మండల పరిధిలో 65 లక్షల రూపాయల వరకు ప్రభుత్వానికి లైసెన్సు ఫీజు చెల్లించి మద్యం దుకాణం కైవసం చేసుకుంటే ఒకరికి వ్యాపారం మంచిగా జరిగే ప్రదేశంలో దుకాణం పెట్టుకోవడానికి అనుమతించడం, మరొకరికి వ్యాపారం పెద్దగా జరుగని ప్రాంతంలో దుకాణం ఏర్పాటు చేయడానికి అనుమతి ఇవ్వడంపై లక్కీ డిప్‌లో విజేతలైన మద్యం దుకాణ వ్యాపారుల్లో అసంతృప్తి నెలకొనే అవకాశం వుంటుంది. మరోవైపు ఇంత పెట్టుబడి పెట్టి మద్యం వ్యాపారం సరిగా జరుగకుంటే లక్కీ డిప్‌లో పేరు వచ్చిన దుకాణదారుడు తీవ్ర నష్టాలను ఎదుర్కొవాల్సి వస్తోంది. ఈ పరిస్థితుల్లో ఒక మండల పరిధిలో ఏర్పాటు అయ్యే దుకాణ వ్యాపారులను సిండికేట్ చేసి మండల పరిధిలో జరిగే మద్యం వ్యాపారంలో వచ్చిన లాభాలు పంచుకునే విధంగా చేయడానికి అధికార పార్టీకి చెందిన కొంతమంది నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు చేస్తే ఎవరికి ఈ వ్యాపారంలో నష్టం వుండదని లేకుంటే లక్కీ డిప్‌లో పేర్లు వచ్చిన దుకాణదారులందరు ఒకే ప్రదేశంలో దుకాణం నిర్వహించడానికి సిద్ధమైతే అందరికి నష్టం తప్పదని అధికార పార్టీకి చెందిన పెద్దలు పేర్కొంటున్నారు. ఈ విషయంపై ఎక్సైజ్ అధికారులు సైతం సిండికేట్ ఏర్పాటు చేయడానికి కసరత్తు చేస్తున్నట్లు సమాచారం.

### పారదర్శకంగా

## మద్యం దుకాణాల కేటాయింపు ప్రక్రియ

### - 2,266 పేర్లతో లక్కీ డిప్ వేసి

### 104 మంది మద్యం దుకాణదారులను ఖరారు : కలెక్టర్



చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

ప్రభుత్వ నూతన మద్యం విధానంలో భాగంగా జిల్లాలో మద్యం దుకాణాలను సోమవారం చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌లో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆధ్వర్యంలో లక్కీ డిప్ ద్వారా లాటరీ వేసి మద్యం దుకాణాలను కేటాయించారు. చిత్తూరు ఆర్ఆర్ గార్డెన్స్‌లోని ఫంక్షన్ హాలులో సోమవారం మద్యం దుకాణాల లక్కీ డిప్‌ను ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ నిర్వహించారు. ఆర్ఆర్ ఫంక్షన్ హాలులో సోమవారం ఉదయం 8 గంటలకు ప్రారంభమైన ఈ లక్కీడిప్ ప్రక్రియ సాయంత్రం వరకు ప్రశాంతంగా కొనసాగి ముగిసింది. జిల్లాలో 104 మద్యం దుకాణాల ఏర్పాటు కోసం ప్రభుత్వం దరఖాస్తులు ఆహ్వానించగా ఈ షాపులను కైవసం చేసుకోవడానికి 2,266 మంది ఆశావాహులు దరఖాస్తులు చేసుకున్నారు. 104 మద్యం షాపుల కేటాయింపుకు సంబంధించి దరఖాస్తులు చేసుకున్న 2,266 మంది దరఖాస్తు నెంబర్లతో లక్కీ డిప్ నిర్వహించి మద్యం షాపులు కేటాయించారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ అండ్ ప్రొహిబిషన్ డిప్యూటీ కమీషనర్ విజయశేఖర్, ఎక్సైజ్ సూపరిటెండెంట్ శ్రీనివాస్, పాల్గొన్నారు.

## టెండర్ల లాటరీ ప్రక్రియ ప్రశాంతం

### జిల్లా కలెక్టర్ డా. ఎస్. వెంకటేశ్వర్

తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త



జిల్లా ప్రభుత్వ నూతన మద్యం పాలసీ మద్యం షాపుల టెండర్లకు సంబంధించిన ఓపెన్ లాటరీ ప్రక్రియ పారదర్శకంగా ప్రశాంతంగా నిర్వహిం చడం జరిగిందని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్ పేర్కొన్నారు. సోమవారం ఉదయం నుంచి తిరుచానూరు శిల్పారామం ఫంక్షన్ హాల్ నందు మద్యం దుకాణాల లాటరీ ప్రక్రియను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, సంబంధిత ఎక్సైజ్ అధికారులతో కలిసి ప్రారంభించారు. మొత్తం 227 షాపులకు 3920 దరఖాస్తులు అందడం జరిగిందని వాటికి సంబంధించిన లాటరీ ప్రక్రియను అత్యంత పారదర్శకంగా, దరఖాస్తుదారుల సమక్షంలో నిర్వహించామని కలెక్టర్ తెలిపారు. సదరు ప్రక్రియ 227 మద్యం షాపులకు మధ్యాహ్నాం వరకు పూర్తి అయిందని తెలిపారు. లాటరీ డిపోలో విజేతగా మద్యం షాపు దక్కించుకున్న వారు అక్టోబర్ 16 నుండి మద్యం షాపులను ప్రారంభించాల్సి ఉంటుందని సంబంధిత ఫీజును ఆరు విడతలుగా చెల్లించవచ్చని తెలిపారు. మొదటి విడత ఇన్స్టాల్మెంట్ రేపు సాయంత్రం లోపు కట్టాల్సి ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ శ్రీనివాసాచారి, అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ వాసుదేవ చౌదరి, ఊహా శ్రీ, ఎక్సైజ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అస్మదీయులకు కాంట్రాక్టులు : నాసిరకం పనులు



ఆగస్త్యేశ్వరాలయం వద్ద లీకేజిలు

### కొద్ది పాటి వర్షాలకే ఉరుస్తున్న ఆలయం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త

ఐదేళ్ళ పాటు పరిపాలించిన వైకాపా పాలనలో శ్రీకాళహస్తీశ్వరాలయాన్ని ఓ ఊపాధి కేంద్రంగా మలచుకున్నారు. శివరాత్రి వస్తుందంటే ఇక ఓ మంది అనుచరులకు నామినేట్ పనుల పండగే పండగగా సాగింది. అస్మదీయులంటే అర్హతతో పని లేదు. అయితే అధికారులు కూడా ఆయన మాటే శాసనసంగా వ్యవహారించారు. ఆయన ఎవరికి చెబితే వారికి నిబంధనలతో పని లేకుండా పనులు అప్పగించారు. శివయ్యకు శఠగోపం పెట్టి నాయకుని మెప్పు కోసం అస్మదీయుల జేబులు నింపటానికి ప్రాధాన్యత ఇచ్చారంటే శ్రీకాళహస్తీశ్వరుని సొమ్ములు ఎలా అప్పనంగా వాడుకున్నారో అర్థమౌతుంది. ప్రస్తుత పాలకులు వచ్చిన కొత్తలో కొరడా అంటూ బీరాలు పలికారు. శివరాత్రి ఖర్చులకు సంబంధించి నివేదికలివ్వాలని డిమాండ్ చేసారు. ఆరంభ శూరత్వంలా మారింది. నాలుగు నెలలు గడచినా ఇంజనీరింగ్ విభాగంలో ఒక్కరి మీద చర్యలు లేదు.

రూ.లక్షలు వెచ్చింపు:ఏడాది తిరగకముందే ఉరుపు:

శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా ఉన్న పెద్ద కన్నలి గ్రామంలో ఆగస్తేశ్వరాలయం ఉంది. ఈ ఆలయం మరమ్మత్తులకు శ్రీకాళహస్తీశ్వరుని నిధులు రూ.12లక్షలు కేటాయించారు. మరమ్మత్తులు చేపట్టారు. ఒక్కరోజు వర్షానికే ఉరుస్తుండటంతో జనం ముక్కున వేలేసుకుంటున్నారు. ఈ మేరకు గ్రామస్థులు ఆలయ ఇఓకు రాతమూలకంగా ఫిర్యాదు చేసారు. గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.

శ్రీకాళహస్తికి నాలుగు కిలో మీటర్ల దూరంలో పెద్ద కన్నలి గ్రామంలో పురాతన కాలం నాటి శివాలయం ఉంది. దీనిని ఆగస్త్యేశ్వరాలయం అని చెబుతారు. ఈ ఆలయం మరమ్మత్తుల పేర గత పాలకులు వైకాపా మద్దతు దారుడు ఎలాంటి అర్హత లేకున్నా పనులు అప్పగించారు. ఆయన పనులు పూర్తి చేసినట్లు బిల్లులు తీసుకున్నాడు. తీరా ఒక్క రోజు చిన్నపాటి వర్షానికే ప్రధాన గోపురం వద్ద నీరు లీక్ అవుతుందని ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో ఆలయానికి వచ్చిన భక్తులు లోపలకు వెళ్ళటానికి ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు వివరించారు. ఈ సమస్యపై స్పందించి చర్యలు తీసుకోవవాలని కోరారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

### కమిషనర్ ఎన్. మౌర్య



తిరుపతి కార్పొరేషన్, అక్టోబర్ 14, ప్రభాతవార్త

బంగాళాఖాతంలో అల్పపీడనం కారణంగా రానున్న రెండు రోజుల్లో భారీ వర్షాలు పడే అవకాశం ఉందని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య అధికారులకు ఆదేశించారు. సోమవారం నుంచి వర్షాలు పడుతుండడంతో నగరంలోని పలు ప్రాంతాల్లో ప్రధాన మురుగునీటి కాలువలు, ముఖ్యంగా పేరూరు చెరువు నుండి నీరు వచ్చే ప్రాంతాలను నగరంలో కపిలతీర్థం, మాల్వాడి గుండం నుండి నీరు వెళ్లే ప్రాంతాలను లోతట్టు ప్రాంతాలైన కొరమేనుగుంట, గొల్లవానిగుంట, జీవకోన ప్రాంతాలను అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాను కారణంగా భారీ వర్షాలు పడే అవకాశం ఉందన్నారు. మురుగు కాలువల్లో వర్షపునీరు నిల్వకుండా, రోడ్డుపైకి నీరు రాకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని అధికారులను ఆదేశించారు. కపిలతీర్థం, మాల్వాడిగ గుండం ప్రధాన కాలువలతో పాటు పలు ప్రాంతాల్లో కాలువలపై అక్రమంగా నిర్మించిన నిర్మాణాలు తొల గింపుకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారు లను ఆదేశించారు. అన్ని పనులు సజావుగా జరిగేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డివో రామ్మోహన్, నగర పాలకషార్ : 1 సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్యాంసుందర్,షార్ : 2 ఇరిగేషన్ ఎస్ఈ శివారెడ్డి, అర్బన్, రూరల్......... తహాశీల్దార్లు భాగ్యలక్ష్మి, రామాంజులు నాయక్, మున్సిపల్ ఇంజనీర్లు తులసి, కుమార్, గోమతి, సిపిఓ దేవి కుమారి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, డిఈలు మహేష్, రమణ, లలిత, ఏసిపిలు రమణ, బాలాజీ, సర్వేయర్ కోటేశ్వర రావు, శానిటరీ సూపర్‌వైజర్లు చెంచయ్య, సుమతి, ఇరిగేషన్, రెవెన్యూ శాఖ అధికారులు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార దినోత్సవం

**చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** ప్రజా సమస్యలను పరిష్కరించడానికి కలెక్టర్ సుమిత్‌కుమార్ మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు కలెక్టరేట్‌లోని నూతన సమావేశ భవనంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ సుమిత్‌కుమార్‌తో పాటు జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, జిల్లా రెవెన్యూ అధికారి బి.పుల్లయ్య, జిల్లా అధికారులు హాజరు కానున్నారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకువచ్చి వాటిని పరిష్కరించుకోవచ్చు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశించారు.

## కాలువల్లో నీరు నిల్వ వుండకుండా చర్యలు

- మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్



**చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** వర్షాల నేపథ్యం లో నగర పరిధిలో ఎక్కడ నీరు నిల్వ వుండకుండా పక్కాగా చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ అధికారులను ఆదేశించారు. మున్సిపల్ కమీషనర్ నరసింహప్రసాద్ సోమవారం పలు ప్రాంతాల్లో పర్యటించి వర్షాల నేపథ్యంలో అధికారులకు పలు సూచనలు చేశారు. మిట్టూరులో గంగినేని మొరవ కాలువను పరిశీలించిన కమీషనర్ కాలువలో అడ్డంకులు తొలగించాలని, ఆక్రమణలు తొలగించేలా సంబంధిత వ్యక్తులను నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. అధిక వర్షాల నేపథ్యంలో కాలువల్లో ఎక్కడ నీరు నిల్వ వుండకుండా సాఫీగా వుండేలా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే కమీషనర్ సిఎంటి రోడ్డులో మేజర్ కాలువను పరిశీలించారు. అలాగే ఆర్టీసీ బస్టాండ్ వద్ద నిలిచిన నీటిని పరిశీలించి అక్కడ నిల్వ వున్న మట్టిని తొలగించాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంహెచ్ఓ డాక్టర్ అనిల్‌కుమార్ నాయక్, శానిటరీ ఇన్స్‌పెక్టర్ లోకనాధం, వార్డు కార్యదర్శులు పాల్గొన్నారు.

**కంట్రోల్ రూమ్ ఏర్పాటు**

భారీ వర్ష హెచ్చరికల నేపథ్యంలో నగర పరిధిలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో ముందస్తు చర్యలను పక్కాగా చేపడుతున్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తున్నట్లు కమీషనర్ పేర్కొన్నారు. వర్షాలకు సంబంధించి ఎదైనా సమాచారం తెలిస్తే 98499 07885 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

## వర్షాలకు అప్రమత్తం

పాలసముద్రం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:



రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురవనుండటంతో ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసిల్దారు అరుణ కుమారి అన్నారు. వర్షాల నేపథ్యంలో సోమవారం తహసిల్దారు కార్యాలయంలో తహసిల్దారు అరుణకుమారి విఆర్‌ఓలతో సమావేశం అయ్యారు. సమావేశంలో మండల పరిధిలో భారీ వర్షాలు నమోదు అయితే తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. వనదుర్గాపురం, ఎస్టీ కాలనీ, పాలసముద్రం పంచాయతీ ఎస్టీ కాలనీలకు వెళ్ళి ఆమె వర్షాలకు అప్రమత్తంగా వుండాలని ప్రజలను కోరారు. ఎదైనా అత్యవసర పరిస్థితులు వుంటే 94910 77033 నెంబర్‌కు సమాచారం అందించాలన్నారు.సర్వేయర్ గణేష్, విఆర్‌ఓలు శ్రీనివాసులు, పవన్‌కుమార్, సాధుపాల్గొన్నారు.

## వర్షాలతో అప్రమత్తం

శ్రీరంగరాజపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:

బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనంతో భారీ వర్షాలు నమోదు అయ్యే అవకాశం వుందని వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా వుండాలని తహసిల్దారు లోకనాధపిళ్ళై అన్నారు. ఈ విషయంపై తహసిల్దారు మాట్లాడుతూ రానున్న మూడు రోజుల పాటు తీవ్ర వర్షాలు నమోదు అయ్యే అవకాశాలు వున్నాయని, ప్రజలు ఎదైనా అవసరం అయితే తప్ప ఇంటి బయటికి రాకూడదన్నారు. తహసిల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, వర్షాలకు సంబంధించి ఏదైనా సమాచారం వుంటే 94910 77028 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలన్నారు.

## నేడు పోలీస్ గ్రీవెన్స్

చిత్తూరు. అక్టోబర్ 14 ప్రభాతవార్త:

ప్రజా సమస్యలను పరిష్కరించడానికి చిత్తూరు జిల్లా పాత పోలీసు కార్యాలయంలో మంగళవారం ఉదయం 10.30 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు ఎస్పీ మణికంఠ చందోలు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నారు. ఈ జిల్లా వ్యాప్తంగా వున్న ప్రజలు తమ సమస్యలను తన దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవచ్చునని ఎస్పీ మణికంఠ చందోలు ఓ ప్రకటనలో తెలిపారు.

## అధికార యంత్రాంగం వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

**కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో కుప్పం నియోజకవర్గంలో అధికార యంత్రాంగం వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ ఆదేశించారు. ఈనెల 16వతేది వరకు చిత్తూరు జిల్లాలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో వర్షాలకు లోనయ్యే ప్రాంతాల్లో అధికారులు యుద్ధ ప్రాతిపదికన చర్యలు చేపట్టేందుకు సిద్ధంగా ఉండాలన్నారు. రెవెన్యూ, ఇతర శాఖలు, సచివాలయ కార్యదర్శులు గ్రామాల్లో అప్రమత్తంగా వ్యవహరించాలన్నారు. లోతట్టు ప్రాంతాలను గుర్తించి ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా తాగునీరు, పారిశుద్ధ్య సేవలు అందించాలన్నారు. అత్యవసర సేవల కోసం మండల, రెవెన్యూ కార్యాలయాల్లో సిబ్బందిని షిఫ్ట్ విధానంలో నియమించామన్నారు. కాలువల్లో నీరు నిల్వ చేరకుండా పూడికతీత పనులు చేయాలని ఆదేశించారు. కుప్పం పట్టణంలో ప్రధాన మార్గాలు, అండర్ బ్రిడ్జిల వద్ద వర్షపునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమీషనరును ఆదేశించారు. ప్రజా జీవనానికి ఎలాంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.

## దళితనేత కన్నన్‌చే పేదకుటుంబానికి ఆర్థికసాయం



**కుప్పంరూరల్, అక్టోబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని గరిగచీనేపల్లికి చెందిన సంతోష్ ఇటీవల మృతి చెందాడు. ఇతని కుటుంబం నిరుపేద కుటుంబం కావడంతో పాటు పూట గడవని స్థితిలో ఉన్న నేపథ్యంలో దళిత నేత, కుప్పం తెదేపా పార్టీ విస్తరణ కమిటీ సభ్యుడు కె.కన్నన్ స్పందించి బాధిత కుటుంబానికి తనవంతుగా ఐదువేల రూపాయల ఆర్థికసాయం అందించారు. మృతుడికి ముగ్గురు కుమార్తెలు, ఓ కుమారుడు సంతానం కాగా అందరూ పిల్లలుగానే ఉన్నారని వారి కుటుంబ పరిస్థితి దృష్ట్యా తనవంతు సాయం అందించానని తెలిపారు. కార్యక్రమంలో నేతలు ఆర్ముగం, చంద్ర, శ్రీనివాసులు, బంగారు, గుణశేఖర్, పాండ్యన్ పాల్గొన్నారు.

## తుఫాను కంట్రోల్‌రూం ఏర్పాటు

**శాంతిపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** తుఫాను హెచ్చరికల నేపథ్యంలో మండల కేంద్రమైన శాంతిపురంలో కంట్రోల్‌రూర ఏర్పాటుచేసినట్లు తహశీల్దార్ శివయ్య తెలిపారు. ఉద్యోగులకు సెలవులు రద్దు చేశామన్నారు. సిబ్బంది అంతా వారి హెడ్ క్వార్టర్స్‌లో తప్పకుండా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. మండలంలో అన్ని శాఖల అధికారులను అప్రమత్తం చేసినట్లు తెలిపారు.

## పెన్షన్లకు నమోదు చేసుకోవాలి

**రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** మండలంలో పెన్షన్లకు అర్హత కలిగిన వారు నమోదు చేసుకోవాలని ఎంపిడిఓ లక్ష్మీకాంత్ తెలిపారు. వృద్ధాప్య, వితంతు, వికలాంగులు వారి పరిధిలోని సచివాలయాల్లో ఆధార్, రేషన్‌కార్డులు తీసుకెళ్లి నమోదు చేయించుకోవాలన్నారు. ఈనెల 15నుంచి ఈ ప్రక్రియ మొదలవుతుందన్నారు. అర్హులు ఈఅవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## ఘనంగా పల్లెపండగ కార్యక్రమం మొదలు

**రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** ప్రభుత్వ ఆదేశాల మేరకు మండలంలో పల్లెపండగ కార్యక్రమాన్ని ఘనంగా ప్రారంభించారు. బగళనత్తం గ్రామంలో ఈసందర్భంగా మినీ గోకులం షెడ్ నిర్మాణానికి తెదేపా నేతలు భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి, రాఘవేంద్రనాయుడు, హనుమంతు, ఉపాధిసిబ్బంది పాల్గొన్నారు.

## మహిళా కార్యకర్త కుటుంబానికి ఆర్థికసాయం

**రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త** మండలంలోని పంద్యాలమడుగు పంచాయతీ గొల్లపల్లికి చెందిన తెదేపా కార్యకర్త మునివెంకటమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న దేశం నేతలు ఆమె మృతికి నివాళులు అర్పించిన అనంతరం పదివేల రూపాయల సాయాన్ని పార్టీ తరపున అందించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట్లప్ప గౌడు, తెలుగుయువత అధ్యక్షుడు విశ్వనాథ్, నేతలు మురుగేష్, కుట్టి, పార్థసారథి, వేణు, గిరి,జయరామప్ప, గంట్లప్ప పాల్గొన్నారు.

## ఘనంగా సోమవారోత్సవాలు

రామకుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త



స్థానిక శ్రీ వల్లీదేవసేన సమేత శ్రీ సుబ్రమణ్యస్వామి ఆల యంలో సోమవారోత్సవాలు ఘనంగా జరిగాయి. ఆంధ్ర,తమిళనాడు, కర్ణాటక నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి ప్రత్యేక పూజలు జరిపారు. ఆలయ ప్రాంగణంలోని శ్రీ వెంకటేశ్వరస్వామి, శ్రీ శనీశ్వరస్వామి, శ్రీ వినాయక, ఓంశక్తి ఆలయాలు, నక్షత్రవనం భక్తులతో కిటకిటలాడాయి. ఆలయ నిర్వాహకులు భక్తులకు అన్నదానం జరిపారు. రూరల్ సిఐ మల్లేష్ యాదవ్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు చేపట్టారు.

# చిత్తూరు డివిజన్

చిత్తూరు, గంగాధరనెల్లూరు, పూతలపట్టు, పలమనేరు, కుప్పం

## గ్రామీణ ఖాజీగా మౌలానా మరో పదేళ్లు



**పుంగనూరు, అక్టోబరు 14 ప్రభాతవార్త :** మండల ముస్లింమత ఖాజీగా డి.మహ్మద్ ఎజాజ్ పదవీకాలాన్ని మరో పదేళ్ళపాటూ పొడిగింపు ఇస్తూప్రభుత్వ మైనార్టీ శాఖ ద్వారా తెలుగుదేశం ఇన్‌చార్జి చల్లా రామచంద్రారెడ్డి ఉత్తర్వులు అందినట్లు దేశం నాయకుడు సయ్యద్‌సుహేల్‌బాషా వివరించారు. ఈమేరకు ఖాజీ నియామకం గురించి రాష్ట్ర మైనార్టీ సంక్షేమశాఖా మంత్రి ఫారూక్‌కు చల్లా బాబు లేఖ రాయడంతో మంత్రి స్పందించి,నియామకపు ఉత్తర్వులు జారీచేసినట్లు వివరించారు. ఈమేరకు ఖాజీ నియామకపు ఉత్తర్వులను సోమవారం చల్లాబాబు,సయ్యద్‌సుహేల్ ఇతర మైనార్టీ మత పెద్దల సమక్షంలో మహ్మద్ ఎజాజ్‌కు అందించారు. కాగా మహ్మద్ ఎజాజ్ మండల ఖాజీగా గతంలోనే 2019లో నియామకంగా కాగా,ఆయన పదవీకాలానికి మరో పదేళ్ళ పొడిగింపు ఇచ్చినట్లు వారు వివరించారు. మండలపరిధిలోని ముస్లింమైనార్టీల వివాహాది కార్యక్రమాలను అధికారికంగా ఖాజీ ఆమోదించాల్సి ఉంది.

## తవణంపల్లె ఇన్‌చార్జి ఎంపీడీఓగా రెడ్డిబాబు బాధ్యతల స్వీకరణ



**తవణంపల్లె, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** తవణంపల్లె మండల ఇన్‌చార్జి ఎంపీడీఓగా ఎన్.రెడ్డిబాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎంపీడీఓగా పనిచేస్తున్న అబ్దుల్ కలాం ఆజాద్‌ను ఇటీవల జరిగిన సాధారణ బదిలీల్లో భాగంగా పెద్దతిప్పసముద్రం ఎంపీడీఓగా నియమిస్తూ ప్రభుత్వం ఉత్వరులు జారీ చేసింది. ఈయన స్థానంలో తవణంపల్లె ఎంపీడీఓ కార్యాలయంలో ఏఓగా పనిచేస్తున్న ఎన్.రెడ్డిబాబును నియమిస్తూ జిల్లా కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. ఈమేరకు ఆయన సోమవారం ఇన్‌చార్జి ఎంపీడీఓగా బాధ్యతలు స్వీకరించారు. ఎంపీడీఓను పలువురు నాయకులు, ప్రజా ప్రతినిధులు, అధికారులు కలసి శుభాకాంక్షలు తెలిపారు.

## టెలిఫోన్ కేబుల్ కోసం రోడ్డుకు చిల్లులు

పాకాల, అక్టోబర్ 14, ప్రభాతవార్త



పాకాల మండల కేంద్రంలో గత కొన్నాళ్లుగా టెలిఫోన్ కేబుల్ పనులు కోసం కొత్తగా వేసిన రోడ్డును ఇబ్బడి ముబ్బడిగా తవ్వేసి నామమాత్రంగా పూడ్చి వదిలేస్తున్నారు. ప్రజల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయిలు వెచ్చించి వేసిన తారు, పది ఇంచ్ల కాంక్రీట్ సిమెంట్ రోడ్డు సైతం భారీ యంత్రాల సహాయంతో అడ్డంగా నిలువుగా చీల్చేసి ఎక్కడికి అక్కడ వదిలేస్తున్నారు. నిత్యం ఇటుగా ప్రయాణించే వాహనదారులు పెద్ద ఎత్తున ప్రమాదాలకు గురవుతున్నారు. ఇదేం పద్ధతి అని ఆర్‌అండ్‌బి అధికారులను ప్రజలు సెల్‌ఫోన్ ద్వారా వివరణ కోరగా వారి నుంచి సరైన సమాధానం రావడం లేదు. అధికారులు ప్రజల కోసం పనిచేస్తున్నారా కాంట్రాక్టర్ మాయలో ఉన్నారా తెలియటం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు నిద్ర మేల్కొని ప్రజల సొమ్ములతో వేసిన రోడ్డుకు జరిగిన నష్టాన్ని ఎక్కడికక్కడ పూర్చి వాహనదారులు ప్రమాదం బారిన పడకుండా చూడాలని ప్రజలు పెద్ద ఎత్తున ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

## ప్రజాసమస్యల్ని చిత్తశుద్ధితో పరిష్కరించాలి : కడ పి.డి.



కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త అధికార యంత్రా ఒగం ప్రజా సమస్యల్ని చిత్తశుద్ధితో పరిష్కరించాలని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. సోమ వారం కుప్పం మండల కార్యాలయంలో ప్రజా సమస్య ల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్)కార్యక్రమంను పి.డి. చేపట్టారు. ఈసందర్భంగా ప్రజలు వివిధ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. పెన్షన్లు, హౌసింగ్ కేటాయించాలని పలువురు వినతులు అందించారు. అనంతరం పి.డి. మాట్లాడుతూ అనంతరం ఆయన మాట్లాడుతూ సాధ్యమైనంత త్వరగా ప్రజల నుంచి వచ్చిన వినతులను పరిష్కరించే బాధ్యత అధికారులపై ఉందన్నారు. శాఖలవారీగా అందిన ఫిర్యాదులను ఆయా శాఖలకు పంపుతామని అధికారులు స్పందించి నిర్ణీతగడువులో గావాటిని పరిష్కరించాలని ఆదేశించారు.డి.ఇ.లు, ఎఇలు,వివిధశాఖలఅధికారులుపాల్గొన్నారు

## కడ కార్యాలయంలో కంట్రోల్‌రూం ఏర్పాటు

కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త

భారీ వర్ష సూచనల నేపథ్యంలో కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ (కడ) కార్యాలయంలో తాత్కాలికంగా కంట్రోల్ రూం ఏర్పాటుచేసినట్లు కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ తెలిపారు. నియోజకవర్గ ప్రజలు వర్షాలతో ఏదేని సమస్యలు ఎదురైతే కంట్రోల్ రూ ంకు చెందిన 9700762765 (కిరణ్), 7731808088(రాజే ంద్ర)లను సంప్రదించి సమాచారం అందించాలని సూచించారు.

# గూడూరు డివిజన్

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాలు

## అన్నీ శాఖల అధికారులను అప్రమత్తం చేశాం

డక్కిలి, అక్టోబరు 14 ప్రభాతవార్త;



బంగాళాఖాతంలో ఏర్పడ్డ అల్పపీడనం ప్రభావం వల్ల కురుస్తున్న భారీ వర్షాలకు ఎటువంటి నష్టాలు చోటుచేసుకోకుండా అన్నీ శాఖలకు సంబందించిన అధికారులు పక్కాగా తగు చర్యలు తీసుకోవాలని ఎమ్మార్వో శ్రీనివాసులు తెలిపారు. డక్కిలి ఎమ్మార్వో కార్యాలయంలో సోమవారం ఆయన తుఫాన్‌కు సంబందించి తీసుకుంటున్న ముందు జాగ్రత్త చర్యలు విలేకరులకు తెలియజేశారు.ఆదివారం ముందస్తుగా జిల్లా అధికారులు ఆదేశాలు మేరకు అన్నీ శాఖలు అధికారులతో మండల స్థాయి సమావేశం నిర్వహించి భారీ వర్షాలు సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించడం జరిగిందన్నారు. అన్నీ సచివాలయాల్లో మండల స్థాయిలో ప్రత్యేక అధికారులను నియమించామని చెప్పారు.సోమవారం ప్రమాద పరిస్థితులు ఉన్న మాటుమడుగు,అత్తలసిద్దవరం గ్రామాల్లోకి అక్కడి ప్రజలతో మాట్లాడి తుఫాన్ సమయంలోజాగ్రత్తలు పాటించాలన్నారు. రాబోయే మూడు రోజులు అన్నీ శాఖలకు సంబందించిన అధికారులు సచివాలయాలపరిదిలో సచివాలయ సిబ్బంది,అదేవిదంగా మండల స్థాయిలో ప్రత్యేక అధికారులుగా నియమించిన అధికారులు అందుబాటులో ఉండాలని తెలిపారు. మండలంలోని అత్తలసిద్దవరం గ్రామం వెలుగోండ కొండలు కింద ఉండడం వల్ల వర్షాలు అధికంగా వస్తే కొండేరు వాగు ప్రాహహం వల్ల వారు రాకపోకలకు ఇబ్బందులు ఉంటాయని మందుస్తుగానే వారికిబియ్యం అందజేసినట్లు తెలిపారు. ఆయన మండలంలోని అత్తల సిద్దవరం, మాటుమడుగు గ్రామాల్లోని వాగులు,వంతెలను డక్కిలి ఎస్సైతో కలిసి సోమవారం పరిశీలించారు.భారీ వర్షాలు సమయంలో ఈప్రాంతాలలో సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఎస్సైకు చెప్పారు.

## తుపాను పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ ఐవి ప్రసాద్



చిట్టమూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం తుపానుగా మారడంతో చిట్టమూరు మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఐవి ప్రసాద్ పిలుపునిచ్చారు. తుపాను ప్రభావం గూడూరు నియోజకవర్గంపై తీవ్రంగా ఉంటుందన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో ఆయన అధికారులను అప్రమత్తం చేసి తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. 24 గంటలూ ప్రజాసేవకు నిర్దేశించిన సిబ్బంది అందుబాటులో ఉండి తక్షణ సహాయం అందిస్తారని తెలిపారు. విపత్కర పరిస్థితుల్లో ప్రజలు 7989370659 కంట్రోల్ రూం నంబరుకు ఫోన్ చేసి సహాయం పొందవచ్చని తెలియజేశారు. తుపాను నేపథ్యంలో కేటాయించిన అధికారులందరు ఆయా ప్రాంతాల్లో ప్రజలకు సేవలు అందించేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వ్యవసాయ కూలీలు, పశువుల కాపరులు, మత్స్యకారులు రానున్న రెండురోజులు బయటికి వెళ్లకూడదని తెలిపారు. సోమవారం తహశీల్దార్ ప్రసాద్, ఎస్ఐ చినబలరామయ్య, డిటి నిరంజన్‌కుమార్, ఎఎస్ఓ మస్తాన్‌బాబు తదితరులు ముంపు గ్రామమైన పిట్టివానిపల్లిని సందర్శించి తక్షణ చర్యలు చేపట్టారు. అలాగే మల్లాం సమీపంలోని తాగేటమ్మ గుడి వద్ద ఉన్న వంతెనను పరిశీలించి వాహనదారులకు పలు సూచనలిచ్చారు.

## ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

- తహశీల్దార్ జయజయరావు

కోట, అక్టోబర్ 14 ప్రభాతవార్త

తుపాను ముప్పు పొంచి ఉన్నట్లు వచ్చిన హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. తీరప్రాంత మండలం కోటలో అధికారులు అప్రమత్తం అయ్యారు. సోమవారం తహశీల్దార్ కె.జయ జయరావు కోట మండలంలోని శ్రీనివాససత్రం, యమదిన్నెపాలెం, గోవిందపల్లి గ్రామాలతో పాటు ఊను గుంటపాలెం, రుద్రవరం, గూడలి గ్రామాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు. లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేకంగా దృష్టి సారించినట్లు తహశీల్దార్ తెలిపారు. అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలు, సామాజిక భవనాలు, అంగన్‌వాడీ కేంద్రాలు వంటి సురక్షిత ప్రదేశాలకు ప్రజలను తరలించేందుకు ప్రణాళిక సిద్ధం చేశారు. ఆయా ప్రాంతాల్లోని చౌకధరల దుకాణాల వద్ద బియ్యం, కందిపప్పు సిద్ధంగా ఉంచారు. పెనుగాలులు తీవ్రత దృష్ట్యా ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం వాటిల్లకుండా ముందస్తు ఏర్పాట్లు చేశారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తకుండా చూడాలని ఏపీఎస్‌పీడీసీఎల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తీరప్రాంత గ్రామాల్లో దండోరా వేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఆర్‌అండ్‌బి, విద్యుత్, రెవెన్యూ, ఇరిగేషన్ శాఖలతో పాటు ఇతర అధికార యంత్రాంగాన్ని తహశీల్దార్ జయజయరావు అప్రమత్తం చేశారు.

## కేంద్రమంత్రిని కలిసిన బిజెపి నేత కోటేశ్వరరావు

కోట, అక్టోబర్ 14 ప్రభాతవార్త



హైదరాబాద్‌లో కేంద్ర బొగ్గుగనుల శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డిని రాష్ట్ర భారతీయ జనతా పార్టీ మాజీ ఉపాధ్యక్షులు, సీనియర్ నాయకులు కుమారి కోటేశ్వరరావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి కోటేశ్వరరావు పూలబొకే అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. కోటకు చెందిన బిజెపి నేత కోటేశ్వరరావు 1983 నుంచి బిజెపిలో క్రియాశీలకంగా పనిచేసి ఒంగోలు, నెల్లూరు జిల్లాలకు ఇన్‌ఛార్జ్‌గా పనిచేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్రం సికింద్రాబాద్ జిల్లాకు ఎన్నికల సమయంలో పార్టీ ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు. కోటేశ్వరరావు అంచలంచెలుగా రాష్ట్రస్థాయికి ఎదిగారు. ఈ నేపథ్యంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు

## మద్యం షాపుల్లో 16 నుంచి వ్యాపారాలకు అనుమతి

- ఎక్సైజ్ సీఐ అరుణకుమారి

నాయుడుపేట, అక్టోబర్ 14 ప్రభాతవార్త

నాయుడుపేట ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో 17 మద్యం షాపులకు వేలంపాటలో దక్కించుకున్న వారు ఈ నెల 16న ఉదయం నుంచి వ్యాపారాలు చేసుకోవచ్చని ఎక్సైజ్ సీఐ అరుణకుమారి తెలిపారు. షాపులు దక్కించుకున్న వారు మంగళవారం డీడీలు తీసి ప్రభుత్వానికి చెల్లించాలని ఆమె స్పష్టం చేశారు. సోమవారం ఆమె విలేఖరులతో మాట్లాడుతూ మద్యం షాపులకు వేలంపాటలో లైసెన్సులు దక్కించుకున్న వారి వివరాలు వెల్లడించారు. కె.ఫణీంద్ర (షాపు నంబర్160), కె.గోపాల్‌రెడ్డి (161), బి.సుధాకర్ (162), ఒబ్బు వెంకటరత్నం (163), జి.సుధీర్ (164), ఎస్‌కె కరిముల్లా (165), సిహెచ్ రత్నకుమార్ (166), సిహెచ్ శ్రావణ్‌కుమార్ (167), కె.రాజేష్ (168), సిహెచ్ శ్రావణ్‌కుమార్ (169), టి.సురేష్‌బాబు (170), ఎం.అనురాధదేవి (171), దువ్వూరు శ్రీనివాసులు (172), పి.సుబ్రహ్మణ్యంరెడ్డి (173), బి.ప్రభాకర్ (174),బి.శ్రీనివాసులునాయుడు(191), కె.గోపాల్‌రెడ్డి (192) షాపులు దక్కించుకున్నారని ఆమె తెలిపారు.

## తుఫాన్ సహాయ చర్యల కోసం కంట్రోల్ రూమ్ ఏర్పాటు

తహశీల్దార్ రాంబాబు

వెంకటగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త



తుఫాను కారణంగా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని వెంకటగిరి తహశీల్దార్ రాంబాబు తెలిపారు. వెంకటగిరిలోనే తహశీల్దార్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. మూడు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని ఎవరు ఇళ్లలో నుండి బయటకు రాకూడదని సూచించారు. ఎక్కడైనా ప్రమాదం సంభవిస్తే తహశీల్దార్ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేశామని తెలిపారు. 08625-295044 నంబర్‌కు ఆపదలు సభ వచ్చినప్పుడు తెలియజేస్తే సిబ్బంది వచ్చి రక్షిస్తారని తెలిపారు. గొడ్డేరు, కైవల్య నదులను ఎస్సై, ఇరిగేషన్ సిబ్బందితో కలిసి పరిశీలించామని తెలిపారు. వీఆర్‌వోలతో సమావేశం పెట్టి అందరిని విధుల్లో ఉంచామని తెలిపారు.

## పల్లె పండుగలో రూ.29 లక్షలతో అభివృద్ధి పనులు

వెంకటగిరి, అక్టోబర్ 14, ప్రభాతవార్త



రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించే పల్లె పండుగ కార్యక్రమంలో 29 లక్షల రూపాయిలతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు ఎంపిడివో కోటేశ్వరరావు తెలిపారు. మండలంలోని పెట్లూరు, తదితర గ్రామంలో పల్లె పండుగ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం నిధులతో గ్రామా ల్లో అభివృద్ధి పనులు చేస్తున్నట్లు చెప్పారు. 406 కుటుంబాలకు పనులు ద్వారా లబ్ది చేకూరుతున్నట్లు చెప్పారు. అభివృద్ధి పనులకు కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం ఏపిఓ దీప, పిఆర్‌ఏ శివకుమార్, హౌసింగ్ ఏఈ రాజా తదితరులు పాల్గొన్నారు.

## డివిసత్రంలో 40.6 మీ.మీ వర్షపాతం నమోదు

దొరవారిసత్రం, అక్టోబర్ 14, ప్రభాతవార్త

దొరవారిసత్రంలో 40.6 మీ.మీ వర్షపాతం నమోదైనట్లు తహశీల్దార్ శైల కుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వర్షంలో ఎవ్వరూ కూడా బయట రాకుడదని అదే విధంగా నాలుగు రోజులు పాటు బహిరంగ ప్రదేశాల వద్ద గాని, ఎత్తైన చెట్ల వద్ద రైతులు, స్థానికులు ఉండరాదని సూచించారు. ఏ గ్రామంలోనైనా తుఫాను ప్రభావం వల్ల ఏమైనా ఇబ్బందులు ఉంటే ఎప్పటికప్పుడు ఆమె దృష్టికి తీసుకురావాలని సూచించారు.

## 18 మద్యం దుకాణాల లక్కీడిప్



గూడూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వం నూతన మద్యం పాలసీలో భాగంగా ప్రైవేటు మద్యం షాపుల ఏర్పాటుకు సంబంధించిన లక్కీ డ్రాను జిల్లా కలెక్టర్‌చే గూడూరు మున్సిపాలిటీకి సంబంధించి 12 షాపులు, చిల్లకూరు మండలంకు సంబంధించిన ఆరు షాపులకు లక్కీ డ్రా నిర్వహించినట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ షేక్ కరీమా బేగం తెలిపారు. గూడూరు మున్సిపాలిటీకి సంబంధించి కళ్లూరు హరిష్ బాబు, గుంజి శ్రీనివాసులు, చిల్లకూరు పట్టాభి రెడ్డి, కయల రమణయ్య, బిల్లు చెంచురామయ్య, వేముల సునీల్, మామిండూరు హరికృష్ణ రెండు షాపులు, తళ్లూరు రవీంద్ర నాయుడు, దోనిపర్తి శ్రీధర్, రావూరు సురేందర, ముమ్మడి వెంకటేశ్వర రావులు ఎంపికైయ్యారు. చిల్లకూరు మండలానికి సంబంధించి కల్లూరు హరిష్ బాబు రెండు షాపులు, తాటిశెట్టి అంకబాబు రెండు షాపులు, తలమట్టి శ్యామ్ ప్రసాద్, కోడూరు మీరా రెడ్డిలు ఎంపికైన్నట్లు ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్ షేక్ కరీమా బేగం తెలిపారు.

## వర్షాల నేపథ్యంలో అప్రమత్తమైన అధికారులు

పెళ్లకూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త



తుపాను నేపథ్యంలో పోలీసు, రెవెన్యూ, ఇరిగే షన్, ఇతర శాఖల అధికారులు అప్రమత్తం అ య్యారు. సోమవారం నాయుడుపేట డిఎస్పీ చెం చుబాబు, పెళ్లకూరు ఎస్ఐ నాగరాజు స్పిందితో కలిసి పెళ్లకూరు మండలం కప్ప గుంటకండ్రిగ వద్ద ఉన్న వంతెన, కలవకూరు, ముమ్మారెడ్డి గుంట, పుల్లూరు మధ్యలో ఉన్న కల్వర్టును పరిశీలించారు.డిఎస్పీ చెంచుబాబు మాట్లా డుతూ వర్షం తీవ్రత ఎక్కువగా లేదన్నారు. అయినప్పటికీ నీటిమట్టం పెరిగి ప్రవాహం పెరిగితే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేసి ప్రజలు ఇబ్బందులు పడకుండా వేరే మార్గంలో ప్రయాణించేలా ఏర్పాటు చేస్తామన్నారు.

## త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం



దొరవారిసత్రం, అక్టోబర్ 14, ప్రభాతవార్త

దొరవారిసత్రం మండలంలోని లింగంపాడు, పల్లంపాడు గ్రామాల్లో త్రైత సిద్ధాంత భగవద్గీత ప్రచారం సోమవారం నిర్వహించారు. భగవద్గీతలోని పురుషోత్తమ ప్రాప్తి యోగం అధ్యయనం నందు 16వ, 17వ శ్లోకంలోని సారాంశంపై త్రైత సిద్ధాంతం ప్రభోద సేవా సమితి హిందు జ్ఞాన వేదిక దుత్తలూరు కమిటీ సభ్యులు గ్రామస్తులకు అవగాహన కల్పించారు. అనంతరం భగవద్గీతను ప్రతి ఒక్కరు చదివి వాటి సారాంశాన్ని నేటి తరం పిల్లలకు కూడా భగవద్గీత పై అవగాహన కల్పించడమే మా లక్ష్యమని కమిటీ సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ప్రసాదు, సుధాకర్, పెంచులరత్నం, కొండారెడ్డి, పెద్దకొండారెడ్డి, మల్లీశ్వరి, లక్ష్మీ, మధుప్రియ, రమ్య, కోటేశ్వరమ్మ, మాలకొండారెడ్డి, రమణయ్యలు పాల్గొన్నారు.

## భారీ వర్షాలకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



బాలాయపల్లి, అక్టోబర్ 14, ప్రభాతవార్త

బాలయపల్లి మండలంలో ఎడతెరపి లేకుండా కురుస్తున్న వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బాలాయపల్లి ఎస్ఐ కె. గోపి మండల ప్రజలను కోరారు. వర్షాలు తగ్గే వరకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఎస్ఐ మాట్లాడుతూ రెండు రోజులు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్నారు. ప్రజలు అత్యవసరమైతే తప్ప బయటికి రావద్దని తెలిపారు. వాగుల పరిసర గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న ఇళ్లల్లో ఎవరు ఉండరాదు అన్నారు. పరివాహ ప్రాంతాల్లో నీటిలోకి ఎవరు వెళ్లొద్దని తెలిపారు. వర్షం కారణంగా విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్లకు షార్ట్ సర్క్యూట్ వచ్చే అవకాశం ఉన్నందున వాటికి దగ్గరగా మనుషులు వెళ్లొద్దని, పశువులను కూడా వెళ్లకుండా జాగ్రత్తలు ఎవరైనా ఆపదలో ఉంటే స్థానిక పోలీస్ స్టేషన్‌కు, అధికారులకు లేదా డయల్ 100కి ఫోన్ చేస్తే సహాయాన్ని అందిస్తారని, పోలీసులకి సహకరించాలన్నారు.

## సిమెంటు రోడ్లకు భూమిపూజ



**శ్రీరంగరాజపురం, అక్టోబర్ 14 ప్రభాతవార్త:** పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉడమలకుర్తి, విలాసరాజపురం మంజూరైన సిమెంటు రోడ్లు, డ్రైనేజీ పనులకు సోమవారం ఎంపిడిఓ మోహన్‌మురళీ భూమి పూజ చేశారు. ఎంపిడిఓ మోహన్ మురళీ మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలనే ఉద్దేశంతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీలను ఉపాధి పథకం కింద పంచాయతీలకు నిధులు మంజూరు చేసిందని ఈ పనులను ప్రజల భాగస్వామ్యంతో చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో వివి పురం దేశం నాయకులు వేణుశెట్టి, ఎపిఓ చంద్రశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్ రేఖ, నౌషాద్‌లు, టెక్నికల్ ఇంజనీర్ కుమార్, తెలుగుదేశం నాయకులు పాల్గొన్నారు.

## బుంగా మల్లికార్జునయ్యకు ఘన సన్మానం

**తిరుపతి హెల్త్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** అలిపిరి డిపోలో ఏడిసిగా పనిచేస్తున్న బుంగా మల్లికార్జునయ్యను కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి టి. చెంగల్ రెడ్డి సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, తిరుపతి జిల్లా ప్రజా రవాణాధికారి టి. చెంగల్ రెడ్డి మాట్లాడుతూ బుంగా మల్లికార్జునయ్య నాటకరంగంలో ప్రవేశించి ఇప్పటికి వందకు పైగా వివిధ రకాల పాత్రలు వేసి రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలలో, దేశంలోని పలు రాష్ట్రాలలో ప్రదర్శనలు చేసారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వారిచే కందుకూరు వీరేశలింగం పంతులు అవార్డు, టిటిడి వారిచే బంగారు గరుడ అవార్డు, నంది అవార్డు, కర్ణాటక రాష్ట్రంలో బిఆర్ అంబేద్కర్ నేషనల్ అవార్డు, ఏపిలో ఏపిజే అబ్దుల్ కలాం నేషనల్ అవార్డు, తెలంగాణలో హైదరాబాద్‌లో భారత కళారత్న అవార్డు, పాండిచ్చేరిలో భారత ప్రతిభారత్న అవార్డు, డిల్లీలోనేషనల్ అవార్డు, డాక్టరేట్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలో మహాత్మాగాంధీ ఎక్సెలెన్సీ అవార్డుఉ అందుకున్నారు. ఇటువంటి ప్రతిభావంతులైన కళాకారుడు మా సంస్థలో పనిచేయడం గర్వంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ నాయకులు మస్తాన్, గురునాథం, సత్యనారాయణ, సతీష్, డిప్యూటీ సిటిఎం భాస్కర్ రెడ్డి ,తిరుపతి డిపో మేనేజర్ బాలాజీలు పాల్గొన్నారు.

## తుఫాను అప్రమత్తం: అధికారుల పరుగులు

శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి డివిజన్‌కు తుఫాను గండం పొంచి ఉందని వాతావరణ కేంద్రం హెచ్చరించటంతో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో శ్రీకాళహస్తి ఆర్‌డిఓ భాను ప్రకాష్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ బి.యస్‌గిరికుమార్‌లు సోమవారం ఉదయం నుంచి పర్యటిస్తూ పర్యవేక్షిస్తున్నారు. ఉదయం రెవెన్యూ కార్యాలయం వద్ద నమోదైన వివరాల మేరకు 36 మీ.మిల వర్షపాతం నమోదైంది. వేకువ జామున 4గంటల నుంచి వర్షం కురిసింది. శ్రీకాళహస్తి మున్సిపాలిటిలో 9 చోట్ల పునరావస కకేంద్రాలు ఏర్పాటు చేసారు. ముఖ్యంగా చెంచులక్ష్మీకాలనీ, కుమారస్వామి తిప్ప, సన్నిధివీధి టూరిస్టుబస్టాండు, వీరముష్టిపాళెంలలో పరిశీలించారు. కాగా ఆర్‌డిఓ శ్రీకాళహస్తి మండలంలోని వేడాం పునరావస కేంద్రాన్ని పరిశీలించారు. ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే బొజ్జల వెంకటసుధీర్‌రెడ్డి ప్రభుత్వం నుంచి రూ.59లక్షలు నిధులు సాధించి ఓటేరు కాలువను మరమ్మత్తులు చేసారు. సిల్టు తొలగించారు. మున్సిపల్ కార్యాలయం వద్ద టోల్‌ఫ్రీ నెంబర్‌ను ఏర్పాటు చేసారు. అయితే కొత్తగా అభివృద్ధి జరుగుతున్న ఎస్‌డికె నగర్‌లో రోడ్లు పరిస్థితి అధ్వాన్నంగా మారింది

## పిఆర్‌ఓ కార్యాలయం వద్ద ఎపిఆర్‌ఓ కార్యాలయం

శ్రీకాళహస్తి,అక్టోబర్ 14 ప్రభాతవార్త

శ్రీకాళహస్తీశ్వరాలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం పలు సంస్కరణలు చేపట్టనున్నట్లు ఆలయ ఇఒ ఎస్ ఎస్‌చంద్రశేఖర్‌ఆజాద్‌సోమవారంఒపత్రికాప్రకటనలోతెలిపారు. సోమవారం నుంచి ఆలయంలో స్థానికులకు దర్శనానికి సమయం కేటాయించారు. అలాగే ఆధార్‌కార్డును పిఆర్‌ఓ కార్యాలయంలో చూపా లనికోరారు. దాంతోమూడురోజుల్లోగేట్‌నెంబర్1వద్దఎపిఆర్‌ఓకార్యాలయంను ఏర్పాటు చేయటానికి ఇఒని ఆదేశించారు.

## శ్రీకాళహస్తి మండలానికి రూ.2కోట్లు: 24 గ్రామాల్లో 67 పనులు

శ్రీకాళహస్తిరూరల్,అక్టోబర్ 14 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని పంచాయతీలకు అభివృద్ది కళ చోటు చేసుకోబోతుంది. ఐదేళ్ళ పాటు పేరుకు మాత్రమే పంచాయతీలుగా మారిన గ్రామాల్లో అభివృద్ధి కళ చోటు చేసుకోబోతుంది. ఉమ్మడి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత ఉపముఖ్యమంత్రి పంచాయతీరాజ్‌శాఖామాత్యులుగా గ్రామాల అభివృద్ధి ప్రత్యేకంగా దృష్టి సారించారు. గ్రామాల్లో అభివృద్ది కార్యక్రమాలకు నిధులుకేటాయించారు. 'పల్లెపండగ కార్యక్రమాలను' ఏర్పాటు చేసారు. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలానికి రూ. 2కోట్లు నిధులు కేటాయించారు. ప్రజావసరాలను బట్టి పనులు చేపట్టుటకు స్థానిక శాసనసభ్యునిచోరవతో నిర్ణయం తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని 47 పంచాయతీల్లో 24 గ్రామాలకు పనులు మంజూరు చేసారు. ఇక్కడ 67 పనులను చేపట్టుటకు టెండర్లు పిలిచారు. గ్రామాల్లో మూలపడ్డ పరిపాలనకు జవసత్వాలు కల్పిస్తూ నిర్ణయం తీసుకున్నారు. అయితే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీకి అండగానిలిచిన పంచాయతీల్లో మొదటి విడత నిధుల్లో ప్రాధాన్యత ఇచ్చినట్లు తెలుస్తుంది. ఈ నేపధ్యంలో శ్రీకాళహస్తి మండలంలోని బి.వెంకటాపురం ఎస్‌టి కాలనీలో 3 పనులు, పెద్దమిట్టకండ్రిగ వేడాం పంచాయతీలో 4 పనులు, సుబ్బానాయుడు కండ్రిగలో 2 పనులకు మంగళవారం ఎంఎల్‌ఏ బొజ్జల సుధీర్‌రెడ్డి ప్రారంభించనున్నారు. కాగా కాపుగున్నేరి 5 పనులు, అబ్బాబట్ల పల్లిలో 1 చెర్లోపల్లిలో నాలుగు, చుక్కల నిడిగల్లు దళిత వాడ 1 గుంట కింద పల్లి 1,ఎంపెడు దళితవాడ, గ్రామంలో 3 ఇనగలూరులో 1పోలి పంచాయతీలో 3 పనులు, రామానుజపల్లిలో 2, యార్లపూడిలో ఒరెండు,గంగల పూడిలో 3 కలవగుంటలో మూడు, ఒరెడ్డిపల్లిలో 1పనిని మంజూరుచేసారు. ఏలవేడులో 4,మంగళపురిలో 7,ముచ్చివోలు 3, ఉడమలపాడులో 1 ఎగువవీధిలో 1, తొండమనాడులో 6,రామాపురంలో 1,కమ్మకొత్తురులో 4 పనులు చేపట్టుటకు తీర్మానం చేసారు. ఆయా గ్రామాల్లో సిమెంటు రోడ్లు, మురుగునీటి కాలువలను నిర్మించనున్నారు.

## తుఫాను సహాయ చర్యలకు విద్యుత్ అధికారులు సిద్దం

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త

నాలుగురోజుల పాటు తుఫాను ప్రభావం ఉంటుందని వాతావరణశాఖ హెచ్చరించడంతో పాటు జిల్లా కలెక్టర్ నిర్వహించిన వీడియో కాన్సరెన్స్‌లో విద్యుత్ అధికారులందరు సిద్దమవ్వాలని ఆదేశించడంతో శ్రీకాళహస్తి సబ్‌డివిజన్ పరిధిలో ఉన్న సిబ్బంది అందరు సిద్దంగా ఉన్నట్లు తిరుపతి రూరల్ ఈఈ ఎన్.వాసురెడ్డి తెలిపారు. తుఫాన్ల ప్రభావానికి ఎక్కడైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే తమకు సమాచారం అందించాలని కోరారు. ఎన్.వాసురెడ్డి, ఈఈ 9440811755,, డిఈఈ సుధాకర్ 9440811784, డిఈఈ రూరల్ ఎ.సుబ్రమణ్యం 944011796, శివ ప్రసాద్, ఎఈ, టౌన్-1 శివప్రసాద్ 9440811792. ఎం.చెంచుకృష్ణ ఎఈ ,టౌన్-2 9440811793, ఎ.బాలాజీ, ఎఈఈ, తొట్టంబేడు 944011794, చలపతి, ఎఈఈ, బిఎన్‌కండ్రిగ, 9440811795, రాజేష్, శ్రీకాళహస్తిరూరల్ ఎఈఈ 9440811798, మునికుమార్, కెవిబిపురం 9440811797, వాసు, ఏర్పేడు 9440811799, వంశీకృష్ణ పాపానాయుడుపేట 9440814313 నంబర్లకు పోన్‌చేయాలని అధికారులు కోరారు. తుఫాను సహాయక చర్యలకు తాము సిద్దంగా ఉంటామన్నారు.

## డిగ్రీ ఫలితాల్లో సిఆర్‌రెడ్డి కళాశాల విద్యార్థుల ప్రతిభ

తొట్టంబేడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త



శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయం డిగ్రీ (2023-24) నాలుగో సెమిస్టర్ పరీక్ష ఫలితాలను ప్రకటించిన విషయం విదితమే. ఈనేపధ్యంలోమండలంలో ఉన్న డాక్టర్ సిఆర్.రెడ్డి డిగ్రీ కళాశాలలో నాలుగో సెమిస్టర్ బిఏలో కె.రూపేష్‌కు 7.9, జె.లహరీబాయికి 7.3, బి.కాంలో డి.హేమలతకు 6.7, తహీర్ అహ్మద్‌కు 6.4, బిఎస్సీలో ఎ.భువనేశ్వరికి 6.99 గ్రేడు పాయింట్లు వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉత్తమ ఫలితాలను సాధించిన విద్యార్థినీ విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ డా.సి.రాజగోపాల్‌రెడ్డి, ప్రిన్సిపల్ కంభం.యశోధ మరియు అధ్యాపక బృందం అభినందించారు.

## ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త




ఎస్వీయూనివర్సిటీ విడుదల చేసిన డిగ్రీ నాలుగోసెమిస్టర్‌ఫలితాల్లో పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న ఆక్స్‌ఫర్డ్ డిగ్రీ కళాశాల విద్యార్థులు ర్యాంకుల ప్రభంజనం సృష్టించినట్లు కరస్పాండెంట్ మధుసూధనరెడ్డి తెలిపారు. విద్యార్థులు యూనివర్సిటీ స్థాయిలో అన్ని గ్రూపుల్లో అగ్రస్థానాలను కైవసం చేసుకున్నారన్నారు. బి.ఎస్సీ (యంఎస్‌సియస్)లో సి.సింధు 9.43, జె.పూజిత 8.20, జి.జ్యోతీష్ 8.13, బి.ఎస్సీ(యంపిసియస్)లో కె.యోగేశ్వరి 8.81, టి.ప్రేమ్‌కుమార్ 8.13, కె.కల్పన 7.43 పాయింట్లతో యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకున్నారన్నారు. బి.కాం(సిఏ)లో కె.హిమ 8.97, ఎస్.కె.మోహ సీనా 9.91, పి.లలితకుమారి 8.84 పాయింట్లతో పట్టణ యూనివర్సిటీ స్థాయిలో వరుసగా ప్రథమ, ద్వితీయ తృతీయ స్థానాన్ని కైవసం చేసుకోగా విద్యార్థులను కళాశాల కరస్పాండెంట్ సి.మధుసూధనరెడ్డి మరియు అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## తుఫాను పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలి

తొట్టంబేడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త



తుఫాన్ పట్ల ప్రజలందరు అప్రమత్తంగా ఉండాలని పార్టీ అధ్యక్షులు గాలిమురళీ నా యుడు ఓ ప్రకటనలో సూచించారు. ఆయన మాట్లాడుతూ ఎంఎల్ఏ బొజ్జలసు ధీర్‌రెడ్డి సూచనల మేరకు తుఫాను పట్ల గ్రామాల్లో రైతులు వ్యవసాయ పొలంలోకి వెళ్ళి చెట్ల కింద నిలబడడం, విద్యుత్ స్తంభాల పక్కన ఉండడం, అదేవిధంగా గంగ కాలువ పొంగిపొర్లుతుండగా పిల్లలను ఇంటి నుంచి బయటకు పంపడం మందికాదన్నారు. ముఖ్యంగా రైతులు అప్రమత్తంగా ఉండాలని ఏవిధమైన సంఘటనలు జరిగినా పోలీ సు వ్యవస్థ ఇరిగేషన్ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది, అగ్నిమాపక సిబ్బంది అందరు అందుబాటులో ఉంటారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఎంఎల్ఏ దృష్టికి తీసుకెళ్ళాలని కోరారు. మండల కార్యాలయతహశీల్దార్, ఎంపిడిఓ, విఆర్‌ఓలు, పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉంటారన్నారు.

## భారీ వర్షసూచనతో అప్రమత్తంగా ఉండండి..మాజీ ఎంఎల్ఏ



**శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త** భారీ వర్షసూచనతో ప్రజలు అందరు అప్రమత్తంగా ఉండాలని మాజీ ఎంఎల్ఏ ఎస్సీవీనాయుడు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నిశాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని తక్షణ చర్యలు చేపట్టేలా సిద్దంగా ఉండాలని కోరారు. అల్పపీడనం కారణంగా నాలుగు రోజులు భారీ నుంచి అతిభారీ వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ విపత్తు నిర్వహణశాఖ హెచ్చరికలు జారీచేసిందని తెలిపారు. లోతట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని, వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు సిద్దంగా ఉండాలని అధికారులను, ప్రజలను కోరారు.



## విద్యుత్ ఏడీగా ఆంజనేయులు

రేణిగుంట, అక్టోబరు 24 ప్రభాతవార్త:

ఏపీఎస్‌పీడీసీఎల్ రేణిగుంట డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్(ఏడీ)గా ఆంజనేయులు సోమవారం రేణిగుంట అర్బన్ అసిస్టెంట్ ఇంజనీర్ కార్యాలయంలోపదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయనకు సబ్ డివిజన్ పరిధిలోని విద్యుత్‌శాఖ అసిస్టెంట్ ఇంజనీర్లు, లైన్ ఇన్‌స్పెక్టర్లు, లైన్‌మెన్‌లు, అసిస్టెంట్ లైన్‌మెన్లు పూల బొకేలు ఇచ్చి ఘనంగా స్వాగతం పలికారు. ఇప్పటి వరకు ఏడీగా ఉన్న ప్రభాకర్‌రావు చిత్తూరు ప్రొటెక్షన్‌కు బదిలయ్యారు. ఆయన స్థానంలో తిరుపతి నుంచి బదిలీపై వచ్చిన ఆంజనేయులు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ వర్షాకాలంలో విద్యుత్‌కు తరచూ అంతరాయం ఏర్పడుతుందన్నారు. విద్యుత్‌శాఖ సిబ్బంది తక్షణం విద్యుత్ పునద్ధరణకు చర్యలుచేపట్టాలన్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఆయనకు స్వాగతం పలికిన వారిలో అర్బన్ ఏఈ పుణ్యకోటి, రూరల్ ఏఈ హరిప్రసాద్, లైన్‌ఇన్‌స్పెక్టర్లునాగరాజు, రెహమ్మాన్, మహేంద్ర తదితరులతో పాటు విద్యుత్ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

## అధికారులు అప్రమత్తంగా ఉండాలి

నగరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:



వాతావరణ శాఖ భారీ వర్ష హెచ్చరికలు చేసిన నేపథ్యంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ మున్సిపల్, మండల స్థాయి అధికారులతో సమావేశమయ్యారు. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో సమావేశమైన ఆయన భారీ వర్షాలు సూచిస్తున్నందున అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. తుఫాను ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో నగరి నియోజకవర్గంలోని అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందు జాగ్రత్తగా అన్ని ఏర్పాట్లను చేయాలని సూచించారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ కృష్ణారెడ్డి, తహసీల్దార్ రవికుమార్, ఇన్‌చార్జి ఎంపీడీవో సతీష్, సీఐ మహేశ్వర్, ట్రాన్స్‌కో డీఈ వెంకటమని, హౌసింగ్ డీఈ శంకరప్ప, మున్సిపల్ డీఈ రవీంద్రరెడ్డి, టీపీవో, ఏఈలు, డీటీ, ఆర్‌ఐలు, ఏఈలు తదితరులు పాల్గొన్నారు.

## నగరి నియోజకవర్గంలో పల్లె పండుగ కార్యక్రమం

నగరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:



నగరి నియోజకవర్గంలో పంచాయతీరాజ్ శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో సోమవారం పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా నగరి రూరల్ మండలం గుడికండ్రిగ గ్రామలంలో రూ.6.25 లక్షల సిమెంటు రోడ్డు నిర్మాణంకు ఎమ్మెల్యే భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## నగరిలో వర్షం వస్తే కార్యాలయం సంగతులు అంతే

నగరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:

నగరిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ కార్యాలయం పై కప్పు నుంచి వర్షపునీరు గదుల్లోకి కారుతోంది. వర్షం వస్తేనే ఫైల్స్, కంప్యూటర్లకు భద్రత లేకుండా పోతుంది. గత ప్రభుత్వం ఈ కార్యాలయాన్ని పునరుద్దరించాలని కోరినా ఏమీ చేయలేదని వాపోతున్నారు. ప్రస్తుతం కురిసన వర్షానికి గదులు మొత్తం నీటితోనిండిపోయింది. ఈ శాఖ గృహ నిర్మాణాల అనుమతులు అందిస్తున్నందున, సిబ్బంది త్వరగా పునరుద్ధరణ జరగాలని కోరుతున్నారు.

## అంతర్ జిల్లా మిక్స్‌డ్ రిలేలో నగరి విద్యార్థి ప్రతిభ

నగరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:



ఈనెల 4 నుంచి 6వ తేదీ వరకు తూర్పు గోదావరి జిల్లా రాజమండ్రి ఆర్ట్స్ కళాశాలలో జరిగిన 37వ అంతర్ జిల్లాల జూనియర్ అథ్లెటిక్స్ ఛాంపియన్ పోటీల్లో అండర్-20 విభాగంలో నగరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన పి.జగదీష్ ప్రతిభ కనబరచినట్లు ప్రిన్సిపాల్ వేణుగోపాల్ తెలిపారు. 400 మీటర్ల మిక్స్‌డే రిలే పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచాడన్నారు. కళాశాలలో బీకాం(సీఏ)3వ సంవత్సరం చదువుతున్న జగదీష్‌ని కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు వైస్ ప్రిన్సిపాల్ భాస్కర్‌రాజు, ఫిజికల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ హెడ్ రెడ్డి నాయక్, పీడీ ప్రేమ్‌కుమార్, అధ్యాపకులు అభినందించారు.

## ఉచిత డీఎస్సీ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నగరి, అక్టోబరు 14 ప్రభాతవార్త:

రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ, అమరావతి వారి ఉత్తర్వుల మేరకు ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు డీఎస్సీ ద్వారా ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్ పోస్టుల నిమిత్తం ఉచిత బోధన, ఉచిత భోజన, వసతి సౌకర్యాలతో మూడు నెలల పాటు శిక్షణ ఇస్తున్నట్లు జిల్లా సంక్షేమ, సాధికార అధికారి జి.రాజ్యలక్ష్మి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. డీఎస్సీ శిక్షణ పొందుటకు టెట్ అర్హత కలిగి, వార్షికదాయం రూ. 2.5 లక్షల లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు ఈ నెల 11 నుంచి 21 తేదీ లోపు జ్ఞానభూమి వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చున్నారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరికి ఈ నెల 27 తేదీ స్క్రీనింగ్ టెస్ట్ పరీక్ష నిర్వహించి అర్హులైన అభ్యర్థులను మెరిట్ లిస్ట్ ప్రకారం ఉచిత డీఎస్సీ శిక్షణకు ఎంపిక చేస్తారన్నారు. వివరాల కొరకు డబ్ల్యు..డబ్ల్యు..డబ్ల్యు...జ్ఞానభూమి ఏపీ జీవోవీ ఇన్‌వెట్ సైట్‌ను సందర్శించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## పల్లె పండుగలో ప్రగతి పనులకు భూమిపూజ

వడమాలపేట, అక్టోబరు 14 ప్రభాతవార్త:



పల్లెపండుగ వాతావరణంలో సోమవారం మండలంలోని బట్టీకండ్రిగ, అప్పలాయగుంట గ్రామాల్లో పలు అభివృద్ధిపనులకు అధికారులు భూమిపూజ చేశారు. సుమారు 61 లక్షల వ్యయంతో సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శేషగిరిరావు మాట్లాడుతూ కొన్నేళ్ల తరువాత కూటమి ప్రభుత్వం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిందన్నారు. పండుగ వాతావరణంలో ప్రజల సమక్షంలో గ్రామాల అభివృద్ధి కోసం మౌలిక వసతులకు ప్రభుత్వం గ్రామసభలు నిర్వహించడం సంతోషకరమని తెలిపారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీవో సుజాత, ఈవోపీఆర్‌డీ దయాకర్, నీటి పారుదలశాఖ ఏఈ రామ్మోహన్, పంచాయతీరాజ్ ఏఈ నాగేంద్ర, టీడీపీ నాయకులు రఘు, వివేకానంద, సర్పంచ్ వెంకటేష్, శివశంకర్‌వర్మ, పొన్నయరాజు, మోహన్, ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌వి వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ మొదటి సంవత్సరపు క్లాసులు ప్రారంభం

తిరుపతి హెల్త్, అక్టోబర్ 14, ప్రభాతవార్త



ఎస్‌వి వైద్య కళాశాలలో మొదటి సంవత్సరం ఎంబిబిఎస్ నూతన వైద్య విద్యార్థి, విద్యార్థినులకు ఓరియంటేషన్ క్లాసులు సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌వి వైద్య కళాశాల అదనపు వైద్య విద్య సంచాలకులు, ప్రిన్సిపల్ డాక్టర్ పిప చంద్రశేఖరన్ మాట్లాడుతూ మొదటి సంవత్సరం వైద్య విద్యార్థి విద్యార్థులను ఉద్దేశించి మంచి వైద్యులుగా తీర్చిదిద్దే బాధ్యత వైద్య అధ్యాపకులకు అప్పగించినందుకు తల్లిదండ్రులకు శుభాకాంక్షలు తెలిపారు. శ్రీ వెంకటేశ్వర వైద్య కళాశాలలో ఎంబిబిఎస్ 2024 -25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్ పొందిన విద్యార్థి విద్యార్థినులు, వారి తల్లిదండ్రులకు వైద్య కళాశాలలో బోధనా పద్ధతులపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించినట్లు రుయా సూపరింటెండెంట్ డాక్టర్ జి. రవిప్రభు తెలిపారు. ఎస్‌వి వైద్య కళాశాలలో ర్యాగింగ్ ఫ్రీ జోన్‌గా పేర్కొన్నారు. విద్యార్థులు కేవలం విద్యను మాత్రమే కాకుండావ్యక్తిత్వ వికాసం పై దృష్టి కేంద్రీకరించి శారీ రకంగా, మానసికంగా, ఆధ్యాత్మికంగా దృఢత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. ఎస్‌వి వైద్య కళాశాలలో వైద్య విద్యను అందించడంలో ఎల్లవేళలా నూతన ఆలోచనలకు ప్రోత్సాహం అందిస్తామని తెలియజేశారు. ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. పార్థసారథి రెడ్డి మాట్లాడుతూ వైద్య వృత్తి ఎంతో మహోన్నతమైనదని వైద్యో నారాయణ హరి అన్న వేదొక్తి మేరకు వైద్యులు ప్రత్యక్ష దేవుడితో సమానమని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా విచ్చేసిన విద్యార్థి విద్యార్థినీల పరిచయ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎస్‌వి వైద్య కళాశాల వైద్య ప్రిన్సిపాల్స్ డాక్టర్ వెంకటేశ్వర్లు, డాక్టర్ సునీత సిరిగిరి, డాక్టర్ బిఎస్‌ఎన్ మూర్తి, డాక్టర్ పాహిం, డాక్టర్ సుజాత, వైద్యులు, వైద్య విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## శానిటేషన్ సిబ్బందికి పెండింగ్ వేతనాలు అందించాలని ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు వినతి



**తిరుపతి హెల్త్, అక్టోబర్ 14, ప్రభాతవార్త** తిరుపతి ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ సిబ్బంది పెండింగ్ వేతనాలు, పెండింగ్ పిఎఫ్, ఈఎస్ఐ, సిబ్బంది సంఖ్య నిబంధనల అనుగుణంగా పెంచాలని, ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి పని భారం తగ్గించాలని వినతి పత్రాన్ని సూపరింటెండెంట్‌కు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 549 జీవో ప్రకారం వేతనాలు, తక్కువ సిబ్బందితో ఎక్కువ పనిచేయించి అధిక పని భారం మోపుతున్నారని ఖాళీగా ఉన్న శానిటేషన్ వర్కర్లను నియామకాలు చేయాలని అనేక సార్లు వినతులు ఇచ్చామన్నారు. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో సమస్యలు అన్ని పరిష్కారం చేస్తామని ఏ1 ప్రాపర్టీస్ మేనేజ్మెంట్ హామీ ఇచ్చిన ఇంత వరకు పరిష్కారం చేయలేదని తెలిపారు. తమ సమస్యలను వారం లోపు పరిష్కరించాలని లేని పక్షంలో ఈ నెల 18వ తేది సమ్మె నిర్వహిస్తామని తెలిపారు.

# తిరుపతి డివిజన్

## శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయంలో మహా కుంభాభిషేకం

పుత్తూరురూరల్, అక్టోబరు 14 ప్రభాతవార్త:



పుత్తూరు మున్సిపల్ పరిధిలోని 20వ వార్డు ముద్దుకృష్ణాపురం గ్రామంలో వెలసిన శ్రీ రుక్మిణీ సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ, జీర్ణోద్ధారణ అష్టబంధన మహా కుంభాభిషేకం వైభవంగా ముగిసింది. ఆదివారం సాయంత్రం 6 గంటల నుంచి సోమవారం ఉదయం 9 గంటలకు ఈ మహా కుంభాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆలయ ఆవరణలో కలిశాలు ఏర్పాటు చేశారు. శ్రీ రుక్మిణి సత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామికి మహా కుంభాభిషేకం, అలాగే కల్యాణ ఉత్సవం కార్యక్రమం నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు.

## రైతులు ప్రకృతి వ్యవసాయంపైనే మొక్కు చూపాలి

కేవీబీ పురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:

మండల కేంద్రమైన కేవీబీపురం ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయంపై, పండించిన పంటలపై సమీక్ష సమావేశం ఆ ప్రోగ్రాం ట్రైనర్ ఎం.వెంకటాచలం, టి.గణేష్‌లు ఏర్పాటు చేశారు. వారు మాట్లాడుతూ నేటి సమాజంలో ఇంతలా వ్యవసాయంలో విష తుల్య ఆహారం కలగకుండా ప్రకృతి వ్యవసాయమైనటువంటి సహజ సిద్ధమైన జీవామృతం ఘన జీవామృతం లాంటి కషాయాలు పదార్థాలను పంట పొలాల్లో వాడడం వల్ల సహజ పంటలతో పండిన కూరగాయలు ఉంటాయని వాటి పోషక విలువలు గురించి వారు వివరించారు. దినేష్ మాట్లాడుతూ సైతం ఈ ప్రకృతి సాంప్రదాయపైన మొగ్గు చూపుతుందని రైతులు కూడా ఆలోచించాలని, రైతులందరూ ప్రకృతి వ్యవసాయపైన మొక్కు చూపాలని ఆయన పేర్కొన్నారు. నేడు కొన్ని గ్రామాల్లో పండించిన పంటలను పరిశీలించారు. ప్రకృతివ్యవసాయంలో పండించిన గోరుచిక్కుడు, బెండకాయ తదితర కూరగాయలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాస్టర్ వెంకటాచలం, గణేష్, ఆనందరావు, కుమార్, సుధాకర్, సిబ్బంది, మండల రైతులు పాల్గొన్నారు.

## లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

-మల్లంగుంటలో విస్తృతంగా పర్యటించిన గ్రామస్తులు, సెక్రటరీ, విఆర్వో

తిరుపతిరూరల్, అక్టోబర్14 ప్రభాతవార్త:



తుఫాన్ నేపథ్యంలో మల్లంగుంట గ్రామ పంచాయతీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పంచాయతీ కార్యధర్శి బాలసుబ్రమణ్యంరెడ్డి, విఆర్వో యోగనందబాబు సూచించారు. సోమవారం టిడిపి నాయకులు పార్లపల్లి మునికృష్ణారెడ్డి, అలిలాల దిలీప్‌కుమార్ యాదవ్‌లతో కలిసి మల్లంగుంట గ్రామ పంచాయతీలో విస్తృతంగా పర్యటించారు. పంచాయతీ పరిధిలోని వినాయక నగర్‌లో రోడ్డుపై నిలిచిన వర్షపునీరు ఓఇంట్లోకి వెళ్ళుతున్న విషయాన్ని గమనించి, ఆ నీటిని డ్రైనేజ్ కాల్వలోకి వెళ్ళేలా చర్యలు చేపట్టారు. రాష్ట్రంలో నాలుగురోజుల పాటు వర్షాలు కురవనున్న నేపథ్యంలో మల్లంగుంట గ్రామ పంచాయతీలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## గ్రామాల్లో సిమెంటు రోడ్లు, డ్రైనేజీ కాలువలకు భూమిపూజ

కేవీబీ పురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:



మండలంలో సిమెంటు రోడ్లు, మురుగు కాలువలకు సోమవారం అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. మండలంలోని కాలంగి హనుమయ్య కండ్రిగ, కల్లూరు పంచాయతీ ఆదరం పంచాయతీ బ్రాహ్మణపల్లి పంచాయతీల్లో రాష్ట్ర ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రులు తలపెట్టిన పల్లె పండుగ గ్రామ సభలను తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు రామాంజులనాయుడు, ఎంపీడీవో రాధారాణి ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఆదేశాల మేరకు ప్రతి పల్లె అభివృద్ధి చేసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో సత్యవేడు నియోజకవర్గ కో-ఆర్డినేటర్ శ్రీపతిబాబు, తిరుపతి పార్లమెంట్ రైతు అధ్యక్షుడు కనపర్తి గోపినాథ్‌రెడ్డి, జనసేన అధ్యక్షులు థామస్‌రెడ్డి, బీజేపీ పార్టీ అధ్యక్షులు శేఖర్, యువత అధికార ప్రతినిధి అవసరం సురేష్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయకుమార్ నాయుడు, మండల మహిళా అధ్యక్షురాలు పావని, యూనిట్ ఇన్‌చార్జి రాజారెడ్డి, మాధవరెడ్డి, మాజీ ఎంపీటీసీ వెంకటేష్, రమేష్, బాబ్జి, బీజేపీ సీనియర్ నాయకులు వెంకటయ్య, మస్తాన్‌రావు, మోహన్, రమణయ్య, బూత్ ఇన్‌చార్జిలు మనోహర్, సుకుమార్, గోపి, సతీష్, నాగరాజునాయుడు, చంద్రారెడ్డి, మండల ఉపాధి హామీ పథకం ఏపీవో కుమారస్వామి, సచివాలయ సిబ్బంది, అధికారులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులకు భూమిపూజ

విజయపురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:



మండలంలో సిమెంటు రోడ్డు, మురుగు కాలువలకు సోమవారం అధికారులు, టీడీపీ నాయకులు భూమిపూజ చేశారు. పల్లె పండుగ పంచాయతీ వారోత్సవాల్లో భాగంగా మండలంలోని విజయపురం, ఇళ్ళత్తూరు, ఆలపాకం, గంగమాంబాపురం, కాళికాపురం, పోతురాజులు కండ్రిగ, తెల్లగుంట, క్షూరికాపురం, కేవీ పురం గ్రామాల్లో సంబంధిత అధికారులు, స్థానిక నాయకులతో భూమిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో రమణప్రకాష్, ఈవోపీఆర్‌డీ సురేంద్రకుమార్, సర్పంచ్‌లు, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

## ఈదురు గాలులకే పరిమితమైన తుఫాను

విజయపురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:

మండలంలో సోమవారం ఉదయం తుఫాను ప్రభావంతో మోస్తరు వర్షం కురిసింది. అనంతరం మండలంలో తుఫాను ప్రభావం పెద్దగా ప్రభావం చూపలేదు. మండలంలో తహసీల్దార్ కిరణ్, అధికార సిబ్బంది జిల్లా కలెక్టర్, నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ సూచనల మేరకు అప్రమత్తం అయినప్పటికి తుఫాను ఈదురు గాలులకే పరిమితమైంది.

## హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ సెలక్షన్లో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ

తిరుపతి విద్య, అక్టోబర్ 14,ప్రభాతవార్త:



శ్రీ వెంకటేశ్వర విశ్వవిద్యాలయంలో ఎం.బి.ఏ చదువుతున్న 9 మంది విద్యార్థులు హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్‌లో ఎగ్జిక్యూటివ్ క్యాడర్‌లో సెలక్టయ్యారు. ఉపకులపతి ఆచార్య అప్పారావు మాట్లాడుతూ మొత్తం 35 మంది విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరయ్యారని, 25 మంది షార్ట్ లిస్టు అయ్యారని, 9 మంది ఎంపికైనారని అన్నారు. రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు మాట్లాడుతూ కష్టపడి చదివి, నైపుణ్యం కనబరిచిన విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఉంటుందని, కాబట్టి విద్యార్థులు నైపుణ్యాలను పెంచుకోవాలని కోరారు. ప్రిన్సిపాల్ ఆచార్య నరసయ్య తదితరులు ఉద్యోగాలు పొందిన విద్యార్థులను అభినందించారు.

## తుఫాను పట్ల అప్రమత్తమైన అధికారులు

రేణిగుంట, అక్టోబరు 14 ప్రభాతవార్త:



బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా విపరీతమైన వర్షాలు కురిసే నేపథ్యంలో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి ఆదేశాల మేరకు రేణిగుంట మండల రెవెన్యూ, మండల అభివృద్ధి, అన్ని పంచాయతీ, పోలీసు యంత్రాంగాలు అప్రమత్తమయ్యాయి. లో తట్టు ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేశారు. ఇరిగేషన్ అధికారులు అప్రమత్తంగా ఉండి ఎప్పటికప్పుడు నివేదికలు అందించాలని కోరారు. సమాచారం కోసం రేణిగుంట తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ స్థాయి అధికారి పర్యవేక్షణలో కంట్రోల్ రూంను 24 గంటలు పనిచేసే విధంగా ఏర్పాటు చేశారు. ఆయా గ్రామాల్లో వీఆర్‌వో, వీఆర్‌ఏ, కార్యదర్శులు, పంచాయతీ సిబ్బందితో పాటు పారిశుధ్య కార్మికులు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రేణిగుంట మాతమ్మగుడి వద్ద ఉన్న పెద్ద కాలువలో చెత్తాచదారాన్ని తొలగించి వర్షపు ప్రవహ నీరు ఎలాంటి అడ్డంకులు లేకుండా ప్రవహించేలా పంచాయతీ కార్యదర్శి మణి జేసీబీ సాయంతో టీడీపీ సీనియర్ నాయకులు బి.పుష్పనాథం పర్యవేక్షణలో పంచాయతీ కార్మికుల ద్వారా శుభ్రం చేయించారు. డిప్యూటీ తహసీల్దార్ శ్యాంప్రసాద్, ఎంపీడీవో విష్ణు చిరంజీవి, రూరల్ సీఐ మురళీకృష్ణ, అర్బన్ సీఐ శరత్‌చంద్ర, గాజులమండ్యం ఎస్ఐ సుధాకర్, అర్బన్ ఎస్ఐ అరుణ్‌కుమార్‌రెడ్డి, ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తున్నారు.

## ప్రతి రెవెన్యూ పంచాయతీలో నిద్ర చేయాలి

కేవీబీ పురం, అక్టోబరు 14 ప్రభాతవార్త:



తుఫాను ప్రభావంతో మండల కేంద్రమైన తహసీల్దార్ కార్యాలయంలో నిద్ర చేస్తున్నట్లు మండల ఇన్‌చార్జి తహసీల్దార్ మునిరత్నం సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి రెవెన్యూ పంచాయతీ హెడ్ క్వార్టర్స్‌లో నిద్ర చేయాలని తుఫాను ప్రభావంతో సంస్థలకు లోతట్టు ప్రాంతాల్లో ఎవరికి ఎలాంటి ప్రమాదకర సంఘటనలు జరగకుండా ప్రజలను కాపాడాలని అందు కోసం నీ కార్యదర్శిని రాత్రి నిద్ర చేసేందుకు ఆదేశాలు ఇవ్వడం జరిగిందని తెలిపారు. తుఫాను ప్రభావంతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా ఉండాలంటే మండల కేంద్రంలో కంట్రోల్ పాయింట్ ఫోన్ నెం.9966144049కు తెలపాలన్నారు.

# గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ : ఎమ్మెల్యే



గూడూరు, అక్టోబర్ 14, ప్రభాతవార్త : గ్రామాల అభివృద్ధికి పల్లె పండుగ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా శ్రీకారం చుట్టారని గూడూరు ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్ పేర్కొన్నారు. సోమవారం గూడూరు మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో సిసి డ్రైనేజ్ కాలువల నిర్మాణానికి గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా మండల పరిధిలోని వెంకటేశుపల్లెల్లో 10 లక్షలు నిదులతో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించింది. ఈ క్రమంలో గత ఆగస్టు నెలలో గ్రామ సభలు నిర్వహించి గ్రామాల్లో చేపట్టాల్సిన అభివృద్ధి పనులను నిర్ణయించారు. గ్రామ సభల్లో ఎంపిక చేసిన అభివృద్ధి పనులను పల్లె పండుగ కార్యక్రమం ద్వారా ప్రారంభోత్సవ కార్యక్రమాలు స్థానిక ఎమ్మెల్యేల ద్వారా సోమవారం ప్రారంభించారు. అక్టోబర్ 14వ తేది నుండి పల్లె పండుగ ప్రగతికి అండగా పంచాయితీ వారోత్సవాలు రాష్ట్రంలో ప్రారంభించారు. స్థానిక ఎమ్మెల్యే వారోత్సవాల్లో భాగంగా ప్రతి మండల పరిధిలో మూడు గ్రామాలలో అభివృద్ధి కార్యక్రమా లను స్వయంగా ప్రారంభించే విధంగా కార్యక్రమం రూపొందించారు. ఈ క్రమంలో గూడూరు ఎమ్మెల్యే సునీల్ కుమార్ గూడూరు మండల పరిధిలోని కొండగుంట గ్రామంలో అరుంధతి వాడలో పది లక్షల రూపాయిల నిధులతో సిసి డ్రైనేజీ కాలువల నిర్మాణానికి ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే సునీల్ కుమార్ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి గ్రామ సభలు ద్వారా ఎంపిక చేసిన పనులను ప్రారంభించి నిర్ణయించిన గడువులోగా వాటిని పూర్తి చేసే విధంగా పల్లె పండుగ కార్యక్రమం రూపొందించడం జరిగిందని తెలిపారు. తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ ఆసుపత్రిలలో వైద్య సేవలు పొందుతున్న వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి విధులు మంజూరు చేసే విధంగా చర్యలు తీసుకుం టామని అవసరమైన వారు గూడూరు ఎమ్మెల్యే కార్యాలయాన్ని, స్థానిక నాయకులను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వరరాజు, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు సెలవులు భాస్కర్ రెడ్డి, గుండాల లీలావతి, మట్టం శ్రావణి, గుండాల శ్రీదేవి, ఎంపిడివో మధుసూదన్ రావు, ఎమ్మార్వో చంద్రశేఖర్, జనసేన బిజెపి పార్టీల నాయకులు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నిబద్ధత కలిగిన నాయకుడు సిఎం చంద్రబాబు

**- ఎమ్మెల్సీ,సమన్వయకమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ - వాల్మీకి కులస్తులకు కానుకగా వాల్మీకి జయంతి రాష్ట్ర పండగ !!**



కుప్పం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : సిఎం చంద్రబాబునాయుడు నిబద్ధత కలిగిన నాయ కుడు అని ఎమ్మెల్సీ, సమన్వయ కమిటీ ఛైర్మన్ డా॥ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. సోమవారం ఏపిఎస్ఆర్టీసీ వైస్ ఛైర్మన్ పిఎస్ మునిరత్నం, వాల్మీకి నేతలు ప్రేమ్‌కుమార్, బేటప్ప నాయుడులతో కలసి స్థానిక తెదేపా కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఉన్న వాల్మీకి కులస్తులకు కానుకగా వాల్మీకి జయంతిని రాష్ట్ర పండగగా నిర్వహించాలని సిఎం చంద్రబాబు ఆదేశించారన్నారు. దీనిపై సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు. వాల్మీకులకు ఎస్టీ హోదా కోసం ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామన్నారు. కుప్పంలో వాల్మీకి మహర్షి విగ్రహం ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. బిసిలకు తొలినుంచి వెన్నుదన్నుగా నిలుస్తోంది తెదేపానేనన్నారు. 1983లో దివంగత ఎన్టీఆర్ తెదేపా ప్రారంభించాక ఎంతోమంది చదువుకున్న బిసి కులాలకు చెందిన అధ్యాపకులు, ఉపాధ్యాయులు, వైద్య రంగాల్లో ఉన్న వైద్యులను గెలిపించారన్నారు. బిసిలకు రాజ్యాధికారం ఇచ్చిన పార్టీ తెదేపా అన్నారు. సిఎం చంద్రబాబు బిసిల పక్షపాతి అని పేర్కొన్నారు. బిసిల అభివృద్ధి, సంక్షేమం కోసం ఎన్నో పథకాలు, కార్యక్రమాలు చేపట్టారన్నారు. కుప్పంలో బిసి కులాలకు స్థలాలతో పాటు కమ్యూనిటీ భవనాలు మంజూరు చేస్తే వాటి నిర్మాణాలను కూడా వైకాపా పాలనలో పూర్తి చేయలేదన్నారు. 13లక్షల కోట్ల అప్పులు ఉన్నా సిఎం చంద్రబాబునాయుడు ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నా రన్నారు. కుప్పంలో 30కోట్ల ఉపాధిహామీ నిధులతో సిసిరోడ్లు, డ్రైనేజీలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్మాణ పనులు జరుగుతున్నాయన్నారు. అతిత్వరలో కుప్పానికి ఏడు పరిశ్రమలు రానున్నాయన్నారు. సిఎం చంద్రబాబు కృషితో కుప్పానికి కేంద్రీయ విద్యాలయం, కృషి విజ్ఞాన కేంద్రాలు వచ్చాయన్నారు. ఈనెల 17న వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. సమావేశంలో కౌన్సిలర్లు జిమ్ దాము, సురేష్, జయరాంనాయుడు, మునిరత్నం, బాబు, సూరి, గిరిదాస్, గోవిందస్వామి, రామచంద్ర, సురేష్, ప్రభాకర్, మంజు, మున్సిపల్ టిడిపి అధ్యక్షుడు రాజ్‌కుమార్, నేతలు కాణిపాకం వెంకటేష్, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

## కెనరా బ్యాంక్ అధికారులచే... రు.10 నాణేలపై అవగాహన




తిరుపతి ,అక్టోబరు 14 ప్రభాతవార్త : రూ.10 నాణేల చట్టపరమైన చెల్లుబాటు గురించిన అపార్థాన్ని తగ్గించా డానికి, ఆ నాణేలపై మరింత విశ్వాసాన్ని పెంపొందించడంలో ఈ అవగాహన కార్యక్రమం తోర్పడుతుందని జనల్ మేనేజర్ పాండురంగ మిథంతాయా, డిజిఎం జిఎన్‌మూర్తి, రవీందర్ కుమార్ అగర్వాల్, రీజనల్‌హెడ్ టి.నాగరాజురావు అన్నారు. రూ.10పై అవగాహన కల్పించేందుకు మొబైల్ కరెన్సీ వ్యాన్‌ను ప్రారంభించి, ఈ నాణేలను ఉపయోగించమని వారు వినియోగదారులను కోరారు. దీనిపై కెనరా బ్యాంకు అధికారులు రు.10 నాణేల సర్క్యులేషన్‌పై అవగాహన కోసం పోస్టర్లను విడుదల చేశారు. ఈ పోస్టర్లను వినియోగదారుల వ్యాపార స్థలాలు, రైతు బజార్ తదితర ప్రాంతాల్లో అతికించాలని ప్రాంతీయ కెనరా బ్యాంకు అధికారులకు వివరించారు.

## చినుకు పడితే కోటకు వణుకు... అవస్థల్లో రవి నగర్ కాలనీ ప్రజలు



కోట అక్టోబరు 14 ప్రభాతవార్త : వర్షా కాలం వచ్చిందంటే చాలు.. కోటలో ప్రజలకు వణుకు పుడుతోంది. రోడ్డు ఆక్రమణ, మురుగు కాల్వలు పొంగడం, వర్షపు నీరు కాలనీల్లోని ఇళ్లలోకి రావడం సర్వసాధారణం జరిగిపోతోంది. కానీ అధికారులు ఏన్నో సంవత్సరాల నుంచి ఏమీ చేయలేని పరిస్థితి కనబడుతోంది. ప్రధానంగా రవి నగర్‌లో వర్షం కాలంలో ఇటు వైపు నీటిపారుదాల కాలవ పక్కన పొంగి ప్రవహిస్తే చాలు ఇక వర్షం ప్రవహం అంతా రవి నగర్‌పై పడుతోంది.స్థానిక ప్రజలు పలు సార్లు అధికారులు తెలిపినా ఏలాంటి ప్రయోజనం కనబడటం లేదని ఆప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. భారీ వర్షాలు కురిస్తే చాలు.. పంచాయతీ పరిధిలో పలు లోతట్టు కాలనీలు జలమయమవుతున్నాయి. ఇళ్లల్లోకి వరద చేరుతుందని వారు ఆందోళన చెందుతున్నారు.పలువురు ఇళ్లల్లోని ఆహార ధాన్యాలు ,వస్తు సామాగ్రి తడిసి పోయిన సంఘటనల లేకపోలేదు.కోట పంచాయతీ పాలకులకు సరైన ప్రణాళిక లేకపోవడంతో వర్షం పడితే కోట రోడ్లన్నీ జలమయవుతాయి.నల్లపరెడ్డి గోపాల్ రెడ్డి విగ్రహం వద్ద పెద్ద పెద్ద గుంతల్లో నీరు చేరుతోంది. పలితంగా వాహన చోదకులు ఆగుంతల్లో పడి గాయాలైన సందర్బాల్లో అనేకం.ప్రధానంగా రోజు రోజుకు కోట విస్తరణ పెరగుతోంది. వరద కాల్వలు,మురుగు పారుదల కాల్వలు ఆక్రమణకు గురవుతన్నాయి, హీరో హోండా షోరాం వద్ద కాలువపై నే నిర్మాణాలు జరిగి పోయాయి.దీంతో భారీ వర్షాలు కురిసినప్పుడు వరద సాఫీగా ముందుకు సాగడం లేదు. వర్షాలు పడినపుడు హడావుడి చేసే అధికారులు ఆతరువాత పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు, ఇకనైనా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## తుఫాన్ నేపథ్యంలో విద్యుత్‌శాఖ అప్రమత్తం ఉండాలి

**-విద్యుత్ సరఫరా పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లు నియామకం -డివిజన్‌స్థాయిలో కంట్రోల్ రూమ్స్ ఏర్పాటు -ఎపిఎస్‌పిడిసిఎల్ సిఎండి సంతోషరావు**



తిరుపతిరూరల్, అక్టోబర్14 ప్రభాతవార్త: తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది, అప్రమత్తంగా ఉండాలని ఎపి ఎస్పీడిసిఎల్ సిఎండి కె.సంతోషరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఎస్పీడిసిఎల్ పరిధిలోని తిరుపతి, చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు, కడప, కర్నూల్, నంద్యాల, అనంతపురం, సత్యసాయి జిల్లాల పరిధిలో తుఫాన్ కారణంగా విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడిన సందర్భాలలో విద్యుత్ పునరుద్దరణ పనుల పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించినట్లు తెలిపారు. కడప సర్కిల్‌కు ఛీఫ్ జనరల్ మేనేజర్ (ప్రాజెక్ట్సు.ఐటి) పి.ఆయూబ్ ఖాన్, నెల్లూరు సర్కిల్‌కు ఛీఫ్ జనరల్ మేనేజర్ (ఎనర్జీ కన్సర్వేషన్ క్వాలిటీ కంట్రోల్) కె.ఆదిశేషయ్య, తిరుపతి సర్కిల్‌కు ఛీఫ్ జనరల్ మేనేజర్ (ఒఅండ్ఎం) డిఎస్ వరకుమార్, కర్నూల్ సర్కిల్‌కు ఛీఫ్ జనరల్ మేనేజర్ (ట్రైనింగ్) ఆర్.పద్మ, అనంతపురం సర్కిల్‌కు జనరల్ మేనేజర్ (ఐటి.శాప్) సిహెచ్.రామచంద్రరావులను నోడల్ ఆఫీసర్లుగా నియమించనున్నట్లు తెలిపారు. ఎపి ఎస్పీడిసిఎల్ సంస్థ పరిధిలో సర్కిల్స్ డివిజన్స్ స్థాయిలో కంట్రోల్‌రూమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సరఫరా పునరుద్దరణ పనులు వేగవంతం చేయడానికి అధికారులు సిబ్బందితో కూడిన ప్రత్యేక బృందాలు అందుబాటులో ఉండాలన్నారు. ఎక్కడైనా విద్యుత్ స్తంభాలు కూలిపోవడం, విద్యుత్ లైన్లు తెగిపడటంలాంటి సంఘటనలను గుర్తించినట్లుయితే తక్షణమే సమీపంలోని విద్యుత్‌శాఖ అధికారులు, సిబ్బందికి గానీ లేదా టోల్ ఫ్రీ నెంబర్స్ 1912 లేదా 1800425 155333కు కాల్ చేసి సమాచారం అందించాలని సూచించారు. అదేవిధంగా సంస్థకు వాట్సప్ నెంబర్ 9133331912కు చాట్ చేయడం ద్వారా విద్యుత్ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి, పరిష్కరించుకోవచ్చునని సూచించారు.

## తుఫాను బాధితుల సహాయం కోసం

**హెల్ప్ లైన్‌ను సద్వినియోగం చేసుకోండి : కమిషనర్ ఎన్. మౌర్య**



తిరుపతి(కార్పొరేషన్), అక్టోబర్14 ప్రభాతవార్త: బంగాళఖాతంలో ఏర్పడిన అల్పపీడనం వలన కురిసే వర్షాలకు ఎటువంటి ఇబ్బందులు కలిగినా హెల్ప్ లైన్ నెంబర్ 0877 2256766కు కాల్ చేసి సమాచారం ఇవ్వాలని నగర పాలక సంస్థ కమిషనర్ ఎన్. మౌర్య ప్రజలను కోరారు. తుఫాను బాధితుల సహాయం కోసం నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ లైన్ సెంటర్‌ను సోమవారం కమిషనర్ పరిశీలించారు. ఇప్పటి వరకు ఎన్ని కాల్స్ వచ్చాయి, ఎంత మంది పనిచేస్తున్నారు ఫిర్యాదులు ఏ విధంగా నమోదు చేస్తున్నారు. అన్న విషయాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ తుఫాన్ వలన కురిసే వర్షాల వలన ఎటువంటి ఇబ్బందులున్నా హెల్ప్ లైన్ 0877 2256766కు కాల్ చేసి తెలపాలని అన్నారు. ఇప్పటికే అన్ని ప్రాంతాల్లో తమ అధికారులు, సిబ్బంది అందుబాటులో వున్నారని అన్నారు. ప్రజలు కూడా తమ వంతు బాధ్యతగా వ్యవహరిస్తే తుఫాన్ ఇబ్బందుల నుండి బయట పడవచ్చునని అన్నారు. ప్రజలు హెల్ప్ లైన్ సదుపాయాన్ని వినియోగించు కోవాలని అన్నారు. కమిషనర్‌తో పాటు అదనపు కమిషనర్ చరణ్ తేజ్‌రెడ్డి, మేనేజర్ హసీమ్, తదితరులు ఉన్నారు.

## రైలు ఢీకొని ఒకరు మృతి!



దొరవారిసత్రం, అక్టోబర్ 14 ప్రభాతవార్త : దొరవారిసత్రం మండల పరిధిలోని డివి సత్రం అండర్ పాస్ బ్రిడ్జి సమీపంలో అప్ లైన్ వద్ద రైలు ఢీకొని ఒకరు మృతి చెందిన విషయం ఆలస్యంగా సోమవారం వెలుగులోకి వచ్చింది. సూళ్ళూరుపేట రైల్వే అధికారుల వివరాలు మేరకు మృతి చెందిన వ్యక్తి దొరవారిసత్రం మండలం కటువపల్లి హరిజనవాడకు చెందిన ఈదూరు రాజేంద్ర ప్రసాదు (32)గా రైల్వే పోలీసులు గుర్తించారు. రాజేంద్ర ప్రసాదు గత కొంత కాలం నుండి మానసికంగా బాధపడేవాడని గత రెండు రోజుల నుండి కటువపల్లిలో కనిపించడం లేదని స్థానిక బంధువులు ఆరోపించారు. అయితే గొర్రెలు కాపర్లు సమాచారం మేరకు రాజేంద్ర ప్రసాదు కుటుంబ సభ్యులు మృతదేహం వద్దకు వచ్చి అతను అనారోగ్య పరిస్థితి పై స్థానిక పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఆ మేరకు రైల్వే పోలీసులు కేసు నమోదు చేసారు. అనంతరం మృతదేహాన్ని సూళ్ళూరుపేట ప్రభుత్వ ఆసుపత్రికి పంచనామ నిమిత్తం తరలించారు.

## వరద బాధితులను తరలించడానికి సర్వం సిద్ధం



దొరవారిసత్రం, అక్టోబర్ 14, ప్రభాతవార్త : బంగాళాఖాతంలో ఏర్పడిన వాయుగుండం భారీ వర్షాలు తుఫానుగా మారే అవకాశం ఉండడంతో ముందస్తు భాగంగా లోతట్టు ప్రాంతాల నుంచి పునరావాస కేంద్రాలకు తరలించడానికి అధికారులు సర్వం సిద్ధం చేశారు. దొరవారిసత్రం మండల పరిధిలోని బురద మడుగు, వేదగిరి పాలెం, తనయాలి ఎస్టీ కాలనీ, వివిఎస్ఆర్ నగర్ ఎస్టీ కాలనీలోని గ్రామాలలోని వరద ముప్పు ప్రాంతాల్లో ఉన్న కుటుంబాలను సురక్షితంగా పునరావాస కేంద్రమైన తెల్లంపాడు జిల్లా ఉన్నత పాఠశాలకు, తనయాలి అంగన్‌వాడి కేంద్రాలకు, తదితర ప్రాంతాలకు తరలించేందుకు తహశీల్దార్ శైల కుమారి, ఎస్ఐ అజయ్ కుమార్‌లు సర్వం సిద్ధం చేసారు. సుమారు 200 కుటుంబాలు పైగా ఉండడానికి వారికి వసతులను ఏర్పాటు చేసారు. ముందుగా తెల్లంపాడు అంగన్‌వాడి కేంద్రాలను ముందుగా పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో ముందస్తు భాగంగా అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసారు. ఎక్కడ కూడా ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా ప్రత్యేక ప్రణాళిక ఏర్పాటు చేస్తున్నట్లు తహశీల్దార్ శైల కుమారి తెలిపారు. అదే విధంగా డివి సత్రం మండల కేంద్రంలో కంట్రోల్ రూంను ఏర్పాటు చేసారు. ఈ తుఫాను ప్రభావం వల్ల ఎప్పటికప్పుడు సమాచారాన్ని కంట్రోల్ రూం నెంబర్ 8341614507 నెంబర్‌కు సమాచారం ఇవ్వాలని ఆమె సూచించారు.

## హత్య కేసులో ముద్దాయి అరెస్టు



చిల్లకూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త : చిల్లకూరు మండల పరిధిలోని తిక్కవరం గ్రామ రెవెన్యూలోని ఓ మామిడి తోటలో సెప్టెంబర్ 8వ తేది తోటలో కాపలా ఉన్నటువంటి మాణికల అంకయ్య దంప తులు జడల వెంకటేశ్వర్ల అలియాస్ ఇంద్రయ్య దంపతులు ఉంటున్నారు. అయితే విలాసాలకు తాగుడికి బానిసైన ఇద్దరు మోటర్లు విద్యుత్ వైర్లు చోరీకి పాల్పడి నగదు పంపకాల్లో ఇద్దరి మధ్య చోటు చేసుకున్న వివాదంలో జడల వెంకటేశ్వర్లుని మానికల అంకయ్య గడ్డపారతో తలపై కొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందిన విషయం తెలిసిందే. అయితే గూడూరు డిఎస్పి ఆదేశాలతో రూరల్ సిఐ కిషోర్ బాబు ఎస్ఐ సురేష్ బాబులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతుండగా సోమవారం చిల్లకూరు తహశీల్దార్ కార్యాలయంలో ఆర్ఐ పనిచేస్తున్న పూర్ణ వద్దకు ముద్దాయి మాలికల అంకయ్య వచ్చి లొంగిపోవడం జరిగింది. ఈ విషయాన్ని వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వడంతో మాణికల అంకయ్యని అదుపులో తీసుకొని విచారించి కోర్టుకు హాజరు పరిచారు. ఈ కేసులో ముద్దాయిని చాకచక్యంగా అదుపులో తీసుకున్నందుకుగాను సిఐ, ఎస్ఐలతో పాటు ఐడి పార్టీ రాజు విష్ణువులను డిఎస్పి అభినందించారు.

## అత్తమామలపై అల్లుడు దాడి!

గూడూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త : గూడూరు రెండో పట్టణంలోని ఇందిరా నగర్‌కు చెందిన కృష్ణారావు, ధనలక్ష్మీలను అల్లుడైన సుబ్రమణ్యం ఆదివారం రాత్రి దాడి చేసిన సంఘటన చోటు చేసుకుంది అయితే పోలీసులు వివరాల మేరకు కృష్ణారావు దంపతులు ఇందిరానగర్‌లో నివాసం ఉంటున్నారు. పెద్ద కుమార్తె మహాలక్ష్మిని విజయవాడకు చెందిన సుబ్రమణ్యం వివాహం అయింది. అయితే అయితే అత్తమామల అల్లుడికి ఆస్తి గొడవ ఉంది. ఈ విషయంపై ఆదివారం సుబ్రమణ్యం కుటుంబ సభ్యులతో కలసి గూడూరుకి వచ్చి ఆస్తి విషయం మాట్లాడుతుండగా ఇరువురు మధ్య కొంత వివాదం నెలకొవడంతో సుబ్రమణ్యం రాడ్డుతో అత్తమామలను గాయపరిచాడు. దీంతో స్థానికులు గాయపడిన వారిని ప్రాంతీయ వైద్యశాలకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో నెల్లూరు జిజిఎంసికి తరలించారు. ఈ మేరకు రెండో పటం సిఐ శ్రీనివాసులు ఎస్ఐ బి. గోపాలు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఎ.కొత్తకోటలో సంఘమిత్ర నియామక " రగడ "



ఎ.కొత్తకోట(చౌడేపల్లి), అక్టోబర్ 14 ప్రభాతవార్త : ఎ.కొత్తకోట గ్రామ సమాఖ్య-2లో సంఘమిత్ర నియామక "రగడ "కొనసాగు తోంది. మండలంలోని పంచాయతీ కేంద్రం ఎ.కొత్తకోట గ్రామసమాఖ్య- 2కు సంబంధించిన సంఘమిత్ర నియామకంపై కొన్ని రోజులుగా వివాదం కొనసాగుతోంది. సోమ వారం జరిగిన వివో సమావేశంలో గొడవలు తారాస్థాయికి చేరుకొన్నా యి. ఐకెపి ఎపిఎం సుబ్రమణ్యం అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రస్తుతమున్న సంఘమిత్ర సుహాసినిని తొలగించి అదే గ్రామానికి చెందదిన వసంతను నియమించడానికి సమీక్షించారు. అయితే సుహాసినికి మద్దత్తు పలికి సమావేశాన్ని బహిష్కరించారు. కాగా తన సంతకాలను ఫోర్జరీ చేసి పలు అక్రమాలకు పాల్పడిందని వసంత సంఘమిత్ర సుహాసినిపై ఆరోపించింది. కొంతసేపు వారిమద్య వాగ్విదం జరిగింది. గ్రామసమాఖ్యలో సమస్య ఉందని సమాఖ్యకు చెందిన రికార్డులు తిరిగి ఇవ్వాలని సంఘమిత్రను కోరగా ఆడిట్ అయిన తర్వాత చర్యలు తీసుకొంటామని అధికారులు సూచించారు. దీంతో సమస్య సద్దుమణిగింది.

సిడిపిఎల్ 1 విఓ వద్ద వాగ్వివాదం జరుగుతున్న దృశ్యం

## వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీపై విజిలెన్స్ విచారణ

**- డిఎంహెచ్ఓ, రిటైర్డ్ ఎఓ, డిసిహెచ్ఎస్‌లకు నోటీసులు జారీ**

చిత్తూరు, అక్టోబర్ 14 ప్రభాతవార్త: జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గత ప్రభుత్వ హయాంలో చేపట్టిన ఉద్యోగ నియామకాలు వైద్య శాఖ అధికారుల మెడకు చుట్టుకొంటున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో గత ప్రభుత్వం హయాంలో జరిగిన ఉద్యోగ నియమాకాలపై విజిలెన్స్ విచారణ నిర్వహించి నివేదిక ఇవ్వాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ మేరకు విజిలెన్స్ అధికారులు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ డాక్టర్ ప్రభావతి, రిటైర్ట్ డిఎంహెచ్ఓ కార్యాలయ ఎఓ విజయబాబు, డిసిహెచ్ఎస్ రాజశేఖర్‌రెడ్డి, బిసి నాయక్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాం చివరిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సుమారు 300 స్టాఫ్ నర్సులు, పారా మెడికల్ సిబ్బంది, ల్యాబ్ టెక్నిషియన్లు, ఆఫీసు సబార్డినేట్స్ తదితర నియమాకాల కోసం నోటిఫికేషన్ జారీ చేసింది. అయితే ఈ నోటిఫికేషన్‌లో వెల్లడించిన అర్హత ప్రకారం ఎక్కడ నియమాకాలు చేపట్టలేదనే ఆరోపణలు తీవ్రంగా వున్నాయి. జిల్లా వైద్య ఆరోగ్యశాఖలో చేపట్టిన కొన్ని ఉద్యోగాల్లో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు ఎలాంటి రోస్టర్లు పాటించలేదని, ఎలా పడితే అలా ఉద్యోగాలు ఇచ్చారని ఆరోపణలు వున్నాయి. మెరిట్ జాబితాను సైతం ప్రక్కన పెట్టి తమకు ఇష్టమైన వారికి ఉద్యోగాలు ఇప్పించారనే విమర్శలు వున్నాయి. ఈ వ్యవహారంపై ప్రభుత్వం సీరియస్‌గా చర్యలకు ఉపక్రమించింది. ఈ విషయంపై విజిలెన్స్ విచారణ నిర్వహించి ఎక్కడైనా తేడాలు వుంటే అనీతికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వం సిద్ధమైంది.

## కూలిన పాఠశాలను పరిశీలించిన ఎస్ఎస్ఎ ఇఇ



పాలసముద్రం, అక్టోబర్ 14 ప్రభాతవార్త: పాల సముద్రం మండలం శ్రీబొమ్మరాజపురం గ్రామ ప్రాథమిక పాఠశాలను సర్వశిక్షాభియన్ ఇఇ మధుసూధన్‌రావు సోమవారం పరిశీలించారు. ' కూలిన పాఠశాల భవనం' అంటూ 'ప్రభాతవార్త'లో ప్రచురితం కావడంతో కూలిన పాఠశాల భవనంను ఇఇ మధుసూధన్ రావు పరిశీలించారు. శిధిలావస్థకు చేరిన పాఠశాలలో పిల్లలు ఎవ్వరిని లోపలికి వెళ్ళకుండా చర్యలు తీసుకోవాలని ఎంఇఓను ఆదేశించారు. భవనం పైకప్పు కూలిపోవడంతో జెసిబి సహాయంతో తీయించాలన్నారు. పాఠశాలకు కొత్త భవనం మంజూరుకు చర్యలు తీసుకుంటామని ఆయన పేర్కొన్నారు.

## గంజాయి మొక్కలు సాగు చేస్తున్నవ్యక్తి అరెస్ట్

రామకుప్పం, అక్టోబర్ 14ప్రభాతవార్త : మండలంలోని 89 పెద్దూరు అటవీ ప్రాంతం సమీపంలో గల వ్యవసాయ పొలాల్లో గంజాయి మొక్కలు సాగుచేస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. గ్రామానికి ఆంజప్ప (55) అనే వ్యక్తి తన పొలంలో సుమారు ముప్పై గంజాయి మొక్కలు సాగు చేస్తున్నట్లు సమాచారం తెలియడంతో రూరల్ సిఐ మల్లేష్ యాదవ్, ఇన్‌చార్జ్ ఎస్సై నరేష్‌లు సంఘటనా స్థలికి చేరుకుని గంజాయి మొక్కలు ధ్వంసం చేశారు. అనంతరం ఆంజప్పను అదుపులో తీసుకుని కేసు నమోదు చేశారు.

## తుఫాన్ నేపథ్యంలో ...

## మండల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

తిరుపతిరూరల్, అక్టోబర్14 ప్రభాతవార్త: తుఫాన్ వల్ల భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో తిరుపతిరూరల్ మండలంలోని లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తిరుపతిరూరల్ ఎంపిడిఓ రామచంద్ర, తహశీల్దార్ రామాంజుల నాయక్ సూచించారు. మండల పరిధిలోని లోతట్టు ప్రాంతాలను సోమవారం ఎంపిడిఓ, తహశీల్దార్‌లు పరిశీలించారు. చెర్లోపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెర్లో ఇండ్లు, వెంకటపతినగర్, పేరూరు గ్రామ పంచాయతీ పరిధిలోని హరిపురం కాలనీ ప్రజలకు చైతన్యపురం హై స్కూల్లో పునరావాస కేంద్రం ఏర్పాటు చేసారు. తుఫాన్ కారణంగా భారీ వర్షాలు కురవనున్నాయని, లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

## కాసరం పిహెచ్‌సిలో డిపిఎంఓ విచారణ

**-ఎంఎల్‌హెచ్‌పిలకు వార్నింగ్ -వార్తకు స్పందన**



తొట్టంబేడు, అక్టోబర్ 14 ప్రభాతవార్త : మందులు కాల్చేశారు...సిరప్‌లు గంగకాలువలోకి.. అన్న శీర్షికన వార్త ప్రచురితం కావడంతో దీనిపై సోమవారం డిపిఎంఓ శ్రీనివాసులు విచారణకు విచ్చేశారు. దీంతో కాసరం పిహెచ్‌సి పరిధిలోని సచివాలయాల్లో పనిచేస్తున్న ఎంఎల్‌హెచ్‌పిలు హాజరవగా ఇలగనూరు, గుండేలిగుంట ఎంఎల్‌హెచ్‌పిలను వైద్యాదికారి డాక్టర్ మధవుడు ముందు విచారించి వారికి వార్నింగ్ ఇచ్చారు. ఎంతో మహోన్నత ఆశయంతో ప్రజలకు అందిస్తోందని వాటిని ఇన్నాళ్ళు ఎందుకు ప్రజలకు సరఫరా చేయకుండా సచివాలయాల్లోనే నిల్వఉంచారని ప్రశ్నించారు. ప్రస్తుతం వర్షాకాల సమయంలో గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని ఎంఎల్‌హెచ్‌పిలు కేవలం సచివాలయాలకే పరిమితం కాకుండా గ్రామాల్లో ఏఎన్ఎంలతో కలసి పర్యటించి ప్రతి ఇంటా సర్వేచేసి వారికి కావాల్సిన ముందస్తు మందులను అందించాలనిఆదేశించారు. శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రిలో కూడా దొరకని మందులు కూడా పిహెచ్‌సి కేంద్రాల్లో దొరుకుతున్నాయని వాటిని ప్రజలకు అందించాలి కానీ ఇలా కాల్చేయాల్సిన పరిస్థితి ఎందుకు ఏర్పడిందని గుండేలిగుంట, ఇలగనూరు ఎంఎల్‌హెచ్‌పిలను నిలదీశారు. ఇకపై ఇలా జరిగే సహించేది లేదన్నారు. మందులను కాల్చేయాల్సిన, పడేయాల్సి వచ్చినా ముందుగా ఉన్నతాధికారులు, లేదా సంబందిత ఆరోగ్య కేంద్ర వైద్యాధికారులకు సమాచారం అందించాలన్నారు. అనంతరం గుండేలిగుంట సచివాలయాన్ని సందర్శించారు. సమయం లేకపోవడంతో ఇలగనూరు సచివాలయ పర్యవేక్షించలేక వెళ్ళిపోయారు. ఆరోగ్య కేంద్రంలో ఉన్న పిహెచ్ఎన్‌ను కూడా విచారించారు.

# స్థానికులు ఆధార్‌కార్డుతో దర్శనాలు!

**-పిఆర్ఓ కార్యాలయం అనుమతి పొందాలి**



శ్రీకాళహస్తి, అక్టోబర్ 14 ప్రభాతవార్త : శ్రీకాళహస్తీశ్వరాలయంలో నిబంధనల ఉచ్చును ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ బిగిస్తున్నారు. ఆలయంలో భక్తులు, సిబ్బందికి డ్రెస్ కోడ్ నిబంధనలు విధించిన ఇఓ సోమవారంఓ పత్రికా ప్రకటన విడుదల చేసారు. అయితే ఆయన ఆదేశాలను కొందరు ఉద్యోగులు అత్యుత్సాహంతో అమలు చేస్తున్నారు. ఏదైనా నిర్ణయం తీసుకునే ముందు ఆలయాధికారులు స్థానిక నాయకులతో మాజీ ధర్మకర్తల మండలి రధసారధులతో చర్చించే వారు.

అయితే ప్రస్తుతం ఆలయంలో అమలు జరుగుతున్న నిర్ణయాలతో స్థానిక భక్తుల్లోనే, కాకుండా దూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తులు కూడా అధికార పార్టీ నాయకునిపై ఆగ్రహిస్తున్నారు.మరి ఆలయంలో గత 20రోజులుగా జరుగుతున్న సంస్కరణలు అన్ని స్థానిక శాసనసభ్యునికి తెలిసే అమలు జరుగుతున్నాయా? లేదా ? అనేది జనంలో చర్చనీయాంశంగా మారింది.

**ఆధార్‌కార్డుతో పాటు పిఆర్ఓ కార్యాలయం అనుమతి అవసరం:** శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఇఓ ఎస్ ఎస్ చంద్రశేఖర్ ఆజాద్ సోమవారం ఓ నిర్ణయం తీసుకున్నారు. దానిని అమలుకు సిబ్బందికి ఆదేశించారు. స్వామి అమ్మవార్ల దర్శనానికి ప్రతి రోజూ ఉదయం, సాయంత్రం స్థానిక భక్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి కూడా అధిక సంఖ్యలో మహిళా భక్తులు వస్తుంటారు. అయితే సోమవారం దర్శనానికి వచ్చే స్థానిక భక్తులు 'ఆధార్‌కార్డు చూపాలని' దానిని పిఆర్ఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బుక్‌లో నమోదు చేసి అక్కడ అనుమతి తీసుకొని దక్షిణ గోపురం, కంచుగడప నుంచి ప్రవేశించాలని ఆదేశించారు. ఉదయం 6 గంటల నుంచి 7.30గంటల వరకు సాయంత్రం 7గంటల నుంచి రాత్రి 8.30 వరకు ర ఓజులో ఒక్కసారే అనుమతించబడుతుందని పేర్కొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో స్థానికులపై ఆంక్షలు విధించటంతో పట్టణంలో జనం ఆగ్రహిస్తున్నారు.ఇలాంటి నిర్ణయాలతో భక్తులు భగ్గుమంటున్నారు.